

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి దిన పత్రిక కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఏవైనా సమస్యలుంటే క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
A.C.O - 9003200801
S.R - 9551168092
27/11, సౌందరరాజన్ స్ట్రీట్, టి.నగర్, చెన్నై-600017

మా సంక్షేమ పథకాలు చూసి

ఓర్వలేకే విమర్శలు

● అన్నాడీఎంకేపై విరుచుకుపడ్డ సీఎం



చెన్నై, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): గత మూడేళ్లుగా ప్రజల కోసం ప్రత్యేకంగా మహిళల కోసం అమలు చేస్తున్న పథకాలను చూసి ఓర్వలేకే అన్నాడీఎంకే నేతలు పనిగట్టుకుని విమర్శలకు పాల్పడుతున్నారని డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. ఈరోడ్ జిల్లా చిన్నియంపాళయంలో ఆదివారం సాయంత్రం ఈరోడ్ అభ్యర్థి ప్రకాష్, నామక్కల్ అభ్యర్థి మాతేశ్వరన్, కరూరు అభ్యర్థి జ్యోతిమణికి మద్దతుగా ఏర్పాటైన ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. పదేళ్ల బీజేపీ పాలనలో ప్రజలంతా కష్టాలపాలయ్యారని, ఆ పార్టీ పాలిస్తున్న రాష్ట్రాల్లో ప్రజల కష్టాలు చెప్పనలవి కావన్నారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలన్నీ ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారికి కూడా లబ్ధి చేకూర్చుతోందన్నారు. ద్రావిడ తరహా పాలనను చూసి అన్నాడీఎంకే సహా ప్రతిపక్షాలు సహించలేకపోతున్నాయన్నారు. తమ ప్రభుత్వం అమలు చేసిన పథకాల వల్ల లోక్‌సభ ఎన్నికల్లోనూ తమ పార్టీ సులువుగా గెలుస్తుందన్న భయంతోనే బీజేపీ, అన్నాడీఎంకే తదితర పార్టీల నాయకులు అదే పనిగా పసలేని విమర్శలు చేస్తున్నారని స్టాలిన్ అన్నారు. రాష్ట్రాన్ని పురోగమన దిశ వైపు పయనింపజేయాలని చూస్తుంటే ప్రతిపక్షాలన్నీ తిరోగమనం వైపు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాయని ధ్వజమెత్తారు. పదేళ్లపాటు రాష్ట్రాన్ని దోచుకుతిన్న అన్నాడీఎంకే నేతలు ప్రస్తుతం బీజేపీతో తెగతెంపులు చేసుకున్నట్లు కపటనాటకాలాడుతూ ప్రజలను మోసగిస్తున్నారని అన్నారు.

ఈరోడ్ సభలో ప్రసంగిస్తున్న స్టాలిన్

జూన్ 4 తర్వాత మోదీ చెల్లని నాణెం!

● మంత్రి ఉదయనిధి విమర్శ

చెన్నై, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి ఘనవిజయం సాధిస్తుందని, జూన్ 4వ తేదీ తర్వాత ప్రధాని నరేంద్రమోదీ చెల్లని నాణెంగా మిగిలిపోతారని రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధి పేర్కొన్నారు. చిదంబరం నియోజకవర్గంలో పోటీ చేస్తున్న డీపీఐ నేత తొల్ తిరుమావళవన్‌కు మద్దతుగా ఆయన ఆదివారం మధ్యాహ్నం ఓపెన్‌టాప్ వ్యాన్‌పై నిలిచి ప్రసంగిస్తూ... కేంద్ర ఎన్నికల సంఘం బీజేపీ పాలకులకు మద్దతుగా వ్యవహరిస్తోందన్నారు. ఆ పార్టీ కూటమిలోని మిత్రపక్షాలు అడిగిన గుర్తులను వెనువెంటనే కేటాయించిందన్నారు. అదే సమయంలో డీఎంకే కూటమి మిత్రపక్షాలకు ఆలస్యంగా గుర్తులు కేటాయించి తన పక్షపాత వైఖరిని రుజువు చేసుకుందన్నారు. తిరుమావళవన్ జరిపిన న్యాయపోరాటం వల్లే ఆఖరి క్షణంలో కుండ గుర్తు లభించిందని, ఈ ఎన్నికల్లో ఆయన ఘనవిజయం సాధించి ప్రత్యర్థుల డిపాజిట్లు గల్లంతు చేయడం ఖాయమన్నారు. ఢిల్లీలో జరుగుతున్న ఇండియా కూటమి సమావేశంలో పాల్గొనేందుకు తిరుమావళవన్ వెళ్లారని, ఆయన సోదరుడిగా తాను ప్రచార బాధ్యతలను నిర్వర్తిస్తున్నానని చెప్పారు. తిరుమావళవన్ డీఎంకే కూటమికి గుడ్‌బై చెప్పి బీజేపీ కూటమిలో చేరుతారంటూ వదంతులు పుట్టించారని, కూటమిలో అడిగినంత సీట్లు లభించకపోయినా అసంతృప్తి చెందక ఏ కూటమిలోనూ చేరలేదని గుర్తు చేశారు. తన ప్రచార పర్యటనలకు ఎండ వేడిని కూడా పట్టించుకోకుండా లక్షలాదిమంది జనం వస్తుండటం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. ఇక, డీఎంకే కూటమిని గెలిపించాలనే దృఢనిర్ణయం రాష్ట్రప్రజలు తీసుకున్నారని తనకు అవగతమవుతోందన్నారు. పదేళ్ల బీజేపీ పాలనలో వంటగ్యాస్ ధరను విపరీతంగా పెంచారని, ఎన్నికలు సమీపిస్తుండటం వల్ల వంద రూపాయలు తగ్గించి ఓట్లు దండుకోవాలని ఆరాటపడుతున్నారని ఉదయనిధి ధ్వజమెత్తారు.



చిదంబరంలో డీపీఐ అభ్యర్థి తొల్ తిరుమావళవన్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న మంత్రి ఉదయనిధి

రేపు కమల్ రెండో విడత ప్రచారం

పెరంబూర్, మార్చి 31: డీఎంకే కూటమి అభ్యర్థులకు మద్దతుగా మక్కల్ నీది మయ్యం అధ్యక్షుడు కమలహాసన్ ఈ నెల 2, 3 తేదీల్లో రెండో విడత ప్రచారం చేపట్టనున్నారు. 2వ తేది సాయంత్రం 4.30 గంటలకు తిరుచ్చి నియోజకవర్గంలో పోటీ చేస్తున్న ఎండీఎంకే అభ్యర్థి దురై వైగో, 5.30 గంటలకు పెరంబలూరు నియోజకవర్గ డీఎంకే అభ్యర్థి అరుణ్ నెహ్రూకు మద్దతుగా కమల్ ప్రచారం చేపడతారని ఆ పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది.

ఎన్నికల బరిలో 950 మంది

ఎన్నికల సంఘం వెల్లడి



అడయార్, మార్చి 31: లోక్‌సభ ఎన్నికల్లో తుదిపోరులో 950 మంది అభ్యర్థులు నిలిచారని ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు రాష్ట్రంలోని 39 నియోజకవర్గాల్లో 1085 మంది నామినేషన్లు దాఖలు చేయగా, నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ అనంతరం 950 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారని ఈసీ వెల్లడించింది. వీరిలో 874 మంది పురుషులు కాగా, 76 మంది మహిళలు ఉన్నారు. గుర్తింపు లేని పార్టీల తరపున పోటీ చేసే అభ్యర్థులతో 152 మంది స్వతంత్ర అభ్యర్థులకు వారు కోరిన ఎన్నికల గుర్తులను కేటాయించినట్టు పేర్కొంది. అయితే, ఎండీఎంకేకు మాత్రం వారు అడిగిన బొంగరం చిహ్నం మాత్రం కేటాయించలేదని, దానికి బదులుగా అగ్గిపెట్టెను కేటాయించినట్టు పేర్కొంది.

చెన్నై తండయార్‌పేట వైద్యనాథన్ ఫ్లైఓవర్ రౌండ్‌తాణా వద్ద వంద శాతం పోలింగ్ ఆవశ్యకతను వివరించేలా నృత్య ప్రదర్శన

డీఎంకేకు వంతపాడుతున్న ఎన్నికల సంఘం

● కేంద్ర మంత్రి మురుగన్ ఆరోపణ



నీలగిరి తక్కర్‌బాబా నగర్‌లో ప్రచారానికి వెళ్తూ మార్గమధ్యంలో మహిళా కూలీలతో మురుగన్

చెన్నై, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల సంఘం అధికారులు డీఎంకే అభ్యర్థులకు, నాయకులకు మద్దతుగా వ్యవహరిస్తున్నారని కేంద్ర మంత్రి, నీలగిరి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఎల్.మురుగన్ ఆరోపించారు. ఇటీవల నీలగిరి డీఎంకే అభ్యర్థి రాజా వాహనాన్ని ఎన్నికల అధికారులు సక్రమంగా తనిఖీ చేయలేదని, ఈ విషయమై ఫిర్యాదు చేసినా ఉన్నతాధికారులు పట్టించుకోలేదన్నారు. మైనార్టీల సంక్షేమానికి పథకాలు అమలు చేస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటున్న డీఎంకే పాలకులు రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల హాస్టళ్లను పరిశీలిస్తే చాలునని అన్నారు. ఆ హాస్టళ్ళన్నీ నివాసయోగ్యంగా లేవన్నారు. ఇక తమిళ భాష సంరక్షకులం తామేనని చెబుతున్న డీఎంకే పాలకులు ఆ భాషాభివృద్ధికి చేసిందేమీలేదన్నారు. వాస్తవానికి తమిళ భాష ఔన్నత్యాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఎలుగెత్తి చాటుతున్నదని ప్రధాని మోదీయేనని పేర్కొన్నారు. కొత్త పార్లమెంట్ భవనంలో చోళరాజుల కాలం నాటి సెంగోల్‌ను ప్రతిష్ఠించారని, కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ఆ సెంగోల్ అలహాబాద్ మ్యూజియంలో వాకింగ్ స్టిక్ పేరుతో మూలన పడి ఉండేదన్నారు. తమిళులు పంచమవేదంగా భావించే తిరుక్కురళ్‌ను 35 భాషల్లో అనువదించిన ఘనత కూడా మోదీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

ఐదుగురు పన్నీర్‌సెల్వంలను వెతికితెచ్చిందెవరు?

● ఓపీఎస్



పెరంబూర్, మార్చి 31: తనపై పోటీచేసేందుకు తన పేరుతో ఉన్న ఐదుగురిని వెతికి తెచ్చింది ఎవరు అని మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం ప్రశ్నించారు. రామనాథపురంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ... రామనాధపుం నియోజకవర్గ ప్రజలు తనకు ఆదరిస్తున్నారని, అందువల్లే తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానన్నారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా తన విజయం తథ్యమన్నారు. అన్ని పండ్ల కంటే పెద్దదైన పనస పండు తనకు గుర్తుగా లభించడం తొలివిజయంగా భావిస్తున్నానని ఓపీఎస్ తెలిపారు.

దేశంలో మోదీ సోప్‌కు మంచి గిరాకీ!

● కాంగ్రెస్ నేత చిదంబరం ఎద్దేవా



అడయార్, మార్చి 31: అవినీతిపరులుగా పేరు గడించిన రాజకీయ నేతలు కాషాయం కండుగా కప్పుకోగానే, వారిని మోదీ బ్రాండ్ సబ్బుతో స్నానం చేయించి ఉత్తములుగా మార్చి వేస్తున్నారన్నారని, ప్రస్తుతం దేశంలో అత్యధికంగా అమ్ముడు పోతున్న సబ్బుల్లో మోదీ సబ్బు రికార్డు స్థాయిలో ఉందని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం ఎద్దేవా చేశారు. జీవితాంతం ప్రధాని కుర్చీలోనే ఉండాలని నరేంద్ర మోదీ ఆశ పడుతున్నారని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శివగంగలో జరిగిన సభలో ఆయన ప్రసంగిస్తూ, రాష్ట్ర ప్రజలకు అవసరమైన అన్ని రకాల సంక్షేమ పథకాలను డీఎంకే - కాంగ్రెస్ కూటమి అమలు చేస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం మహిళలకు రూ.1000 నగదు, పుదుమైపెణ్, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, విద్యార్థులకు ఉదయం వేళల్లో అల్పాహార పథకం వంటి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. పేద, మధ్యతరగతి ప్రజల ప్రభుత్వం డీఎంకే సర్కారు అన్నారు. కానీ, కేంద్రంలోని మోదీ సర్కారు ధనవంతుల ప్రభుత్వమన్నారు. కాంగ్రెస్ రహిత భారత్ కావాలంటూ మోదీ పిలుపునిచ్చారని, కానీ దేశంలో ప్రాంతీయ పార్టీలు అనేవి లేకుండా చేయాలన్న కుట్రతో ఆయన పాలన సాగిస్తున్నారని విమర్శించారు. కేంద్రంలో ఒకే పార్టీ అధికారంలో ఉండాలని, ప్రధాని కుర్చీలో జీవితాంతం ఉండాలని ప్రధాని మోదీ ఆశపడుతున్నారని పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీలో 2027 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉన్నారని, వీరంతా ఉత్తములా అని ఆయన ప్రశ్నించారు. ఏ ఒక్క బీజేపీ నేతపై కేసులు నమోదు కావడం లేదన్నారు.

కచ్చాదీవి వ్యవహారంలో కరుణానిధి ద్రోహం

● అన్నామలై ఆరోపణ



అన్నామలైతో సెల్ఫీ తీసుకుంటున్న విద్యార్థులు

చెన్నై, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కచ్చాదీవిని శ్రీలంకకు ధారాదత్తం చేసి మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి తమిళ జాలర్లకు తీరని ద్రోహం చేశారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఆరోపించారు. కోయంబత్తూరు నియోజకవర్గంలో ఆదివారం ఆయన ప్రచారం చేశారు. ఆ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కచ్చాదీవికి సంబంధించిన వివరాల కోసం ఆర్‌టీఐ ప్రకారం దరఖాస్తు పెట్టుకున్నానని చెప్పారు. తొలివిడతగా తనకు అందిన వర్తమానం ప్రకారం కచ్చాదీవి భారత దేశపు అంతర్భాగంగా కొనసాగేందుకు అప్పటి ప్రధాని నెహ్రూ ఇష్టపడలేదన్నారు. ఇక ఈ వ్యవహారంలో అప్పటి ముఖ్యమంత్రి కరుణానిధి చేసిన ద్రోహానికి సంబంధించిన వివరాలు సోమవారం తనకు అందనున్నాయని, ఆ వివరాలను తాను మీడియా సమావేశంలో వెల్లడిస్తానని చెప్పారు. 1948 వరకు కచ్చాదీవి రామనాథపురం చక్రవర్తి సంస్థానం ఆధీనంలో ఉండేదని, 1974లో ఆ దీవిని శ్రీలంకకు ధారాదత్తం చేశారని పేర్కొన్నారు. భారత తొలి ప్రధాని నెహ్రూ కచ్చాదీవికి తాను ఎలాంటి గౌరవ మర్యాదలు ఇవ్వబోనని ఫైల్‌నోట్‌లో రాతపూర్వకంగా తెలియజేశారన్నారు. 1960 నుంచి అంచెలంచెలుగా కేంద్రంలో అప్పట్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం, రాష్ట్రంలో కరుణానిధి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కచ్చాదీవిని దారబోసి ప్రస్తుతం ఈ వ్యవహారంలో తమకు ఎలాంటి పాత్ర లేదంటూ డీఎంకే నేతలు చెబుతుండటం విడ్డూరంగా ఉందని అన్నామలై పేర్కొన్నారు.

కమలం గుర్తుతో ఉన్న టీషర్టుల స్వాధీనం

అడయార్, మార్చి 31: తెన్‌కాశిలో భారతీయ జనతా పార్టీ ఎన్నికల గుర్తు అయిన కమలం గుర్తును ముద్రించిన వెయ్యి టీషర్టును ఎన్నికల తనిఖీ బృందం స్వాధీనం చేసుకుంది. తెన్‌కాశి - ఇళంజి సాలైలో ఎలక్షన్ ● ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ముత్తుకృష్ణన్ వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో కమలం గుర్తు ముద్రించిన వెయ్యి టీషర్టులను వాహనంలో తరలిస్తుండగా, స్వాధీనం చేసుకుని తెన్‌కాశి ఆర్డీవోకు అప్పగించారు.

మురుగుకాల్వ పూడికతీత పనుల్లో విషాదం

ప్రహరీ కూలి ఐదుగురి మృతి



ప్రమాద స్థలంలో శిథిలాలను తొలగిస్తున్న కార్మికులు

పుదుచ్చేరి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి మరపాలం ప్రాంతం వద్ద మురుగునీటి కాల్వ పూడికతీత పనుల సందర్భం గా కాలువను ఆనుకుని ఉన్న విద్యుత్ బోర్డు కార్యాలయం ప్రహరీ కూలడంతో ఐదుగురు దుర్మరణం చెందారు. విద్యుత్‌బోర్డు కార్యాలయం వెనుకవైపు వసంతంనగర్ లో మురుగునీటి కాల్వ తవ్వకం, పూడికతీత పనులు జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం విద్యుత్‌బోర్డు కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న కాల్వలో ఎక్స్‌కవేటర్ ద్వారా పూడికతీత పనులు జరిగాయి. అరియలూరు జిల్లాకు చెందిన భాగ్యరాజ్, బాలమురుగన్, ఆరోగ్యరాజ్ సహా 16 మంది కార్మికులు ఈ పనుల్లో పాల్గొన్నారు. ఆ సమయంలో ఉన్నట్టుండి విద్యుత్ బోర్డు కార్యాలయం ప్రహరీ కూలింది. శిథిలాల కింద ఆరుగురు చిక్కుకున్నారు. మిగిలిన పది మంది ఈ ప్రమాదం నుండి తప్పించుకున్నారు. సమాచారం అందుకున్న ముత్యాలపేట పోలీసులు, అగ్నిమాపక దళం సభ్యులు హుటాహుటిన అక్కడికి చేరుకుని శిథిలాలను తొలగించి ఐదుగురిని వెలికి తీశారు. కొన ఊపిరితో ఉన్న ముగ్గురిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స ఫలించక కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ముత్యాలపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

రంజాన్ వేళలు

సోమవారం : ఇఫ్తార్ : సాయంత్రం -6.28
మంగళవారం : సహర్ : ఉదయం -4.24



పది ప్రాంతాల్లో 100 డిగ్రీల ఫారన్‌హీట్

పెరంబూర్, మార్చి 31: రాష్ట్రంలో పది ప్రాంతాల్లో 100 డిగ్రీల ఫారన్‌హీట్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ మేరకు ప్రాంతీయ వాతావరణ కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలో ప్రధానంగా పొడి వాతావరణం నెలకొనడంతో పాటు పగటి ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ వరకు పెరుగుతాయని తెలిపింది. ఆదివారం ఈరోడ్‌లో 104 డిగ్రీల ఫారన్‌హీట్ (40 డిగ్రీల సెల్సియస్), సేలంలో 103.64 (39.8), పరమత్తి వేలూరులో 103.1 (39.5), ధర్మపురిలో 102.2 (39), వేలూరులో 102.2 (39), తిరుచ్చిలో 101.84 (38.8), తిరుత్తణిలో 101.66 (38.7), మదురై విమానాశ్రయంలో 101.12 (38.4), తంజావూరులో 100.4 (38), మదురై నగరంలో 100.4 డిగ్రీల ఫారన్‌హీట్ (38 డిగ్రీల సెల్సియస్) ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వాతావరణ కేంద్రం తెలియజేసింది.

ఆదిభట్ల సాహిత్యం సమాజానికి కనువిప్పు

మోదుగుల రవికృష్ణ



మోదుగుల రవికృష్ణను సత్కరిస్తున్న వేద విజ్ఞాన వేదిక అధ్యక్షుడు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు

ప్యారీస్, మార్చి 31: హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు సాహిత్యం సమాజానికి కనువిప్పు కలిగిస్తుందని గుంటూరులోని విశ్వనాథ సాహిత్య అకాడమీ కార్యదర్శి మోదుగుల రవికృష్ణ పేర్కొన్నారు. వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహిక 147వ కార్యక్రమం టీనగర్ ఆంధ్రా క్లబ్ కృష్ణా హాలు వేదికగా ఆదివారం సాయంత్రం జరిగింది. వక్త మోదుగుల రవికృష్ణను వేద విజ్ఞాన వేదిక అధ్యక్షుడు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు సంప్రదాయ బద్ధంగా శాలువతో సత్కరించారు. అనంతరం 'ఆదిభట్ల నారాయణదాసు వ్యక్తిత్వం - సాహిత్యం' అనే అంశంపై వక్త ప్రసంగిస్తూ తెలుగు ప్రజలమదిలో సుస్థిర స్థానం సంపాదించుకున్న ఆదిభట్ల హరికథ, సాహిత్య రంగంలో రాణించారని కొనియాడారు. ఆ రంగాలకు ఆయన చేసిన కృషిని తనదైన శైలిలో ఆయన వివరించారు. పామరుల నుంచి పండితుల దాకా వారి హృదయాలను హత్తుకునేలా ఆదిభట్ల కలం నుంచి జాలువారిన సాహిత్యాలన్నీ ఆణిముత్యాలేనని అన్నారు. చెన్నై నగరంలో తెలుగువారి మధ్య మహా పండితుడైన ఆదిభట్ల నారాయణదాసు వ్యక్తిత్వం, సాహిత్యం గురించి ప్రసంగించే అవకాశం రావటం ఆనందంగా ఉందని, వేద విజ్ఞాన వేదిక తరతరాల తెలుగు కవిత కార్యక్రమం వందేళ్లపాటు ఇలాగే కొనసాగాలని మోదుగుల రవికృష్ణ ఆకాంక్షించారు.



సభకు హాజరైన సాహితీ అభిమానులు

సమాచార దర్శిని

రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం

పెరంబూర్, మార్చి 31: రాష్ట్రంలో విద్యుత్ వినియోగం రికార్డు స్థాయికి చేరింది. రాష్ట్రంలో సరాసరి విద్యుత్ వినియోగం 30 కోట్ల యూనిట్లు. ప్రస్తుతం ఎండ తీవ్రత పెరగడంతో ఏసీల వినియోగం అధికం కావడంతో విద్యుత్ వినియోగం కూడా పెరుగుతోంది. రాష్ట్రంలో 2023 ఏప్రిల్ 20వ తేది విద్యుత్ వినియోగం అత్యధికంగా 42.37 కోట్ల యూనిట్లుగా ఉంది. ఈ నేపథ్యంలో, శుక్రవారం రాష్ట్రంలో విద్యుత్ వినియోగం 42.64 కోట్ల యూనిట్లకు చేరిందని విద్యుత్ బోర్డు అధికారులు తెలిపారు.

సెమిస్టర్ పరీక్షా తేదీల్లో మార్పులు

పెరంబూర్, మార్చి 31: రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లింల కోరిక మేరకు పాఠశాలల్లో 4 నుంచి 9వ తరగతి వరకు నిర్వహించనున్న 3వ సెమిస్టర్‌కు సంబంధించి రెండు పరీక్షా తేదీలు మారాయి. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలు ఈ నెల 19వ తేది జరుగనున్న నేపథ్యంలో, ఆలోపు పాఠశాలల్లో వార్షిక పరీక్షలు ముగించాలని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రకారం 1 నుంచి 9వ తరగతి వరకు 3వ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 2 నుంచి 12వ తేది వరకు నిర్వహించనున్నట్లు టైంటేబుల్ విడుదల చేశారు. అలాగే, 13వ తేది నుంచి పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో, రంజాన్ పండుగ సందర్భంగా 4 నుంచి 9వ తరగతి వరకు ఈ నెల 10వ తేది నిర్వహించనున్న సైన్స్ పరీక్ష ఈ నెల 22వ తేది, 12వ తేది నిర్వహించాల్సిన సోషల్ పరీక్ష 23వ తేదీకి వాయిదా వేశారు. కానీ, విద్యార్థులు 13వ తేది నుంచి పాఠశాలకు రానవసం లేదని, పరీక్షల సమయంలో వస్తే చాలని విద్యాశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది. అలాగే, ఈనెల 8వ తేది నుంచి ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులు పాఠశాలలకు హాజరుకావాలి. విద్యార్థుల అడ్మిషన్లు, పరీక్ష పేపర్ల మూల్యాంకనం తదితరాలకు ఈ నెల 26వ తేది వరకు ఉపాధ్యాయులకు పాఠశాలలకు రావాలని విద్యాశాఖ తెలియజేసింది.

ఏడుగురు అధికారులకు ఐఏఎస్ హోదా

పెరంబూర్, మార్చి 31: ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఏడుగురికి ఐఏఎస్ హోదా కల్పించారు. యేటా ఐఏఎస్ హోదా ఖాళీ పోస్టుల భర్తీకి రాష్ట్ర విభాగాల అధికారులను నియమిస్తుంటారు. ఈ క్రమంలో, 2022 సంవత్సరానికి సంబంధించి ఏడుగురికి ఐఏఎస్ హోదా కల్పించారు. ఎన్నికల కమిషన్ అనుమతితో కేంద్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ప్రకారం, రాష్ట్రప్రభుత్వ ఉన్నతాధికారులు కె.శివసౌందరవల్లి, వి.మోహన్‌చంద్రన్, ఆర్.సతీష్, ఎస్.కందస్వామి, ఆర్.సుకుమార్, దుర్గామూర్తి, కె.పోర్కొడి తదితరులను నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

మే 1వ తేది బెంగళూరు - చెన్నై డబుల్ డెక్కర్ సమయాల్లో మార్పు

పెరంబూర్, మార్చి 31: బెంగుళూరు - చెన్నై మధ్య నడుపుతున్న డబుల్ డెక్కర్ రైలు సమయం మే 1వ తేది మారుతుందని దక్షిణ రైల్వే తెలిపింది. నెం.22626 బెంగళూరు - చెన్నై డబుల్ డెక్కర్ రైలు మధ్యాహ్నం 2.30 గంటలకు బయల్దేరి రాత్రి 8.35 గంటలకు చెన్నై చేరుకుంటుంది. ఈ నేపథ్యంలో, ఈ రైలు మే 1వ తేది నుంచి గంట ముందుగా మధ్యాహ్నం 1.30 గంటలకు బెంగళూరులో బయల్దేరి రాత్రి 7.45 గంటలకు చెన్నై చేరుకుంటుందని దక్షిణ రైల్వే తెలిపింది.

3న షోళింగర్ రోప్‌కార్ సేవలు రద్దు

పెరంబూర్, మార్చి 31: షోళింగర్ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన రోప్‌కార్ సేవలు ఈనెల 3న నిలిపి వేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు ప్రకటించారు. కొండపై ఉన్న ఈ ఆలయానికి భక్తులు 1,305 మెట్లు ఎక్కాల్సి ఉంది. వృద్ధులు, పిల్లల సౌకర్యార్థం గత నెల 8వ తేది నుంచి రోప్‌కార్ సేవలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో, నిర్వహణ రీత్యా ఈనెల 3వ తేది రోప్‌కార్ సేవలు నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. 4వ తేది నుంచి యధావిధిగా రోప్‌కార్ సేవలు కొనసాగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

అమల్లోకి వచ్చిన టోల్ ఫీజుల పెంపు

అడయార్, మార్చి 31: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 29 టోల్ ప్లాజాల్లో పెంచిన టోల్ ఫీజులు మార్చి 31వ తేదీ అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చాయి. 5 నుంచి 10 శాతం మేరకు పెంచుతున్నట్టు అన్ని టోల్ ప్లాజాలకు జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ సర్క్యులర్‌ను పంపించిన విషయం తెల్సిందే. దీంతో రాష్ట్రంలోని జాతీయ రహదారుల్లో ఉన్న 29 టోల్‌ప్లాజాలలో శనివారం అర్ధరాత్రి నుంచి పెంచిన టోల్ ఫీజులను వసూలు చేశారు. అయితే, ఫీజుల పెంపును అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ పెంపు భారం సరకుల రవాణాపై పడుతుందని తద్వారా నిత్యావసర సరకుల ధరలు కూడా పెరిగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఓటు వేస్తామని 4 లక్షల మందితో ప్రతిజ్ఞ

- రికార్డు నెలకొల్పిన జీసీసీ

ప్యారీస్, మార్చి 31: లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల్లో రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకుంటామంటూ చెన్నైలో సుమారు 4 లక్షల మంది ఓటర్లు ప్రతిజ్ఞ చేశారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా 100 శాతం పోలింగ్ లక్ష్యంతో వివిధ కార్యక్రమాలను జీసీసీ చేపడుతోంది. ఉత్తర చెన్నై నియోజకవర్గంలో ఓటు హక్కు అవగాహన కార్యక్రమాన్ని 12 గంటలు నిర్వహించగా, ఇందులో పాల్గొన్న 4,10,988 మంది ఓటర్లు ఓటు వేస్తామని హామీ ఇస్తూ సంతకాలు చేశారు. దీన్ని ఎలైట్ వరల్డ్ రికార్డ్స్ అకాడమీ ప్రతినిధులు నమోదు చేశారు. అనంతరం కార్పొరేషన్ కమిషనర్, చెన్నై జిల్లా ఎన్నికల అధికారి జె.రాధాకృష్ణన్, ఎన్నికల అధికారులు ఆర్.లలిత, రవితేజకు ప్రశంసపత్రాన్ని అందించారు.

- రెండో విడత మెట్రో రైలు పథకం

అండర్ గ్రౌండ్ మార్గం పనులు ప్రారంభం

ప్యారీస్, మార్చి 31: రెండో విడత మెట్రోరైలు పథకంలో స్థానిక విల్లివాక్కం నియోజకవర్గ పరిధిలో ఉన్న నాదముని నుంచి కొళత్తూర్ వరకు అండర్ గ్రౌండ్ రైలు మార్గం పనులు నవంబరులో ప్రారంభించనున్నట్లు చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ సంస్థ ప్రకటించింది. ఈ మార్గంలో సొరంగ రైలు మార్గం, రైల్వేస్టేషన్ల నిర్మాణానికి సంబంధించిన ఒప్పందం ముగియడంతో నాలుగు నెలల క్రితం రైల్వేస్టేషన్ల నిర్మాణపనులు చురుగ్గా సాగుతున్నాయి. అండర్ గ్రౌండ్‌లో మొత్తం 23 రైల్వేస్టేషన్లు నిర్మించేందుకు పథకం కూడా రూపొందించారు. నవంబరులో ప్రారంభం కానున్న ఈ పనుల్లో ఐదవ రైలు మార్గంలో నాలుగు విదేశీ యంత్రాలను ఉపయోగించనున్నట్లు అధికారులు తెలిపారు.







వెప్పేరి సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ సంఘ కాపరి రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన ఈస్టర్ ఆరాధన - గణేశపురం ఈసీఐ సెయింట్ పీటర్స్ చర్చిలో కాపరి డి.బాలరాజు అధ్యక్షతన పునరుత్థాన ఆరాధనలో పాల్గొన్న సభ్యులు
మోడల్ లైన్ సెయింట్ పీటర్స్ లూథరన్ హోలి చర్చిలో ప్రత్యేక గీతాలు ఆలపిస్తున్న ఆదాంరాజ్, శాస్త్రిబాబు తదితరులు

కోలాహలంగా ఈస్టర్ వేడుకలు

ప్యారీస్, మార్చి 31: రాష్ట్రవ్యాప్తంగా క్రైస్తవులు ఆదివారం ఈస్టర్ ఘనంగా జరుపుకున్నారు. మానవాళి శ్రేయస్సు కోసం శిలువపై ప్రాణాలు విడిచి మూడో రోజు పునరుత్థానుడైన యేసుక్రీస్తు మహిమను కీర్తిస్తూ ఆదివారం పండుగను కోలాహలంగా జరుపుకున్నారు. వేకువజామున 3 గంటలకు పునరుత్థాన, ప్రాతఃకాలం ఆరాధనలో పాల్గొనే ముందు కొవ్వొత్తులతో గీతాలు పాడుతూ చర్చిలకు చేరుకున్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పునరుత్థాన ఆరాధనలు నిర్వహించారు. దేశం సుభిక్షంగా ఉండాలని, రోగులు వ్యాధుల బాధల నుంచి బయటకు రావాలని, మతసామరస్యం పెంపొందాలని కాంక్షిస్తూ నాగపట్టినం జిల్లాలోని వేలాంకన్ని పునిద మేరీమాత ఆలయంలో తమిళం, తెలుగు, ఆంగ్లం, మలయాళం, హిందీ, కొంకిణి తదితర భాషల్లో ఆలయ ఫాదర్ ఇరుదయరాజ్ అధ్యక్షతన ప్రార్థనలు నిర్వహించారు. బిసెంట్ నగర్‌లోని అన్నై వేలాంకన్ని ఆలయం, సెయింట్ థామస్ మౌంట్ చర్చి, శాంథోమ్ చర్చి, ఎగ్మూర్ సేక్రెడ్ హార్ట్ బాసిలికాల్లో ఈస్టర్ ఆరాధనలు జరుపుకున్నారు.

తెలుగు చర్చిల్లో...

వెప్పేరి హైరోడ్డులో ఉన్న మద్రాసు సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ సంఘం (ఎంసీటీబీసీ) కాపరి రెవరెండ్ డాక్టర్ ఎస్.రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఆరాధనలో సంఘ అధ్యక్షుడు జి.రామయ్య, కార్యదర్శి పోతల ప్రభుదాస్, ట్రెజరర్ ఎ.బాబు ఇతర కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు. సండేస్కూలు చిన్నారులు, యూత్, క్వయర్, స్త్రీల సమాజం సభ్యులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

గణేశపురం ఈసీఐలో...

వ్యాసర్పాడి సమీపంలోని గణేశపురం ఎంకేఎం నగర్‌లో ఉన్న ఈసీఐ సెయింట్ పీటర్స్ తెలుగు చర్చిలో సంఘకాపరి రెవరెండ్ డాక్టర్ బాలరాజు అధ్యక్షతన జరిగిన ప్రత్యేక ఆరాధనలో పెద్దల కమిటీ, స్త్రీల సమాజం, యూత్, సండే స్కూలు, సంఘ విశ్వాసులు పాల్గొన్నారు.

మోడల్ లైన్...

వాషర్‌మెన్‌పేట సమీపంలోని మోడల్ లైన్‌లో ఉన్న సెయింట్ పీటర్స్ లూథరన్ హోలి చర్చిలో అసిస్టెంట్ పాస్టర్ ఆదాంరాజ్, సీహెచ్ శాస్త్రిబాబు దైవ సందేశం వినిపించారు. స్త్రీల సమాజం, సండేస్కూలు సభ్యులు ఆలపించిన ఈస్టర్ ప్రత్యేక గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

అయనావరం...

అయనావరం రైల్వే కాలనీలోని రక్షణ సైన్యం సంఘంలో కోర్ ఆఫీసర్లు మెరుపు విక్టర్ ఇమ్మానుయేలు, ఎంపీఆర్ నివేదిత అధ్యక్షతన జరిగిన ఈస్టర్ ఆరాధనలో సంఘ సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యదర్శి ఎస్.థామస్ సహా నిర్వాహకులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ఐసిఎఫ్...

ఐసిఎఫ్ జంక్షన్‌లోని పునరుత్థాన లూథరన్ దేవాలయంలో పాస్టర్ రెవరెండ్ ఇంటి రవిబాబు ఆధ్వర్యంలో ఈస్టర్ ప్రత్యేక ఆరాధనలు ప్రారంభమయ్యాయి. సంఘ క్వయర్ బృందం, స్త్రీల సమాజం సభ్యులు ఈస్టర్ విశిష్టతపై ప్రత్యేక గీతాలు శ్రావ్యంగా ఆలపించారు. నిర్వాహకులు పీఎస్ ప్రకాష్ బాబు, కె.ప్రసన్న కుమార్, ఎన్.ప్రభు, ఎం. ప్రసన్న, డీబీ జాన్సర్, ఆల్బర్ట్ రావు, విజయలక్ష్మి సత్య రాజ్, మాలతి, పి.ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెరంబూర్....

పెరంబూర్ కుక్స్ రోడ్డులో ఉన్న వాటర్‌బరీ మెమోరియల్ తెలుగు బాప్టిస్ట్ ఆలయ కాపరి రెవరెండ్ డాక్టర్ పాల్ ఈశ్వరప్ప ఆధ్వర్యంలో పునరుత్థాన ఆరాధన ప్రారంభమైంది. సంఘ ఉపాధ్యక్షుడు బీఎస్ జీవన్‌రాజు, కార్యదర్శి జి.నాగేశ్వరరావు, కోశాధికారి ఎన్.పాల్ నాగేశ్వరరావు సహా సహాయ పాస్టర్లు, కమిటీ సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. దివ్యకృప మినిస్ట్రీస్ చెన్నై నిర్వాహకులు డాక్టర్ వి.అహరోన్ దైవ సందేశం అందించారు.

పెన్నర్స్ లైన్...

పాత చాకలిపేట పెన్షనర్స్ లైన్ తెలుగు బాప్టిస్ట్ చర్చిలో కాపరి రెవరెండ్ డాక్టర్ పి.ఐజక్ అధ్యక్షతన ఆదివారం వేకువజామున 3 గంటలకు క్రీస్తు పునరుత్థాన దీపారాధన, ఉదయం 9 గంటలకు ఈస్టర్ ఆరాధన నిర్వహించారు.

విల్లివాక్కం...

విల్లివాక్కం నియోజకవర్గం రాజమంగళం రక్షణ సైన్యం సంఘంలో మేజర్ నాగేశ్వరరావు, మేజర్ ఎస్తేర్‌రాణి అధ్యక్షతన జరిగిన ఈస్టర్ ఆరాధనలో లెఫ్టినెంట్ కల్నల్ ముద్దా అబ్రహాం లింకన్, మెర్సీ మంజుల దైవ సందేశం అందించారు. సార్జంట్ మేజర్ ఐజక్ ఎబినేజర్, కార్యదర్శి గోగుల ఎజ్రా, కోశాధికారి వి.వరుణ్‌కుమార్ వేడుకల ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈస్టర్ సందర్భంగా సంఘ యువజన విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రేమ విందులో సంఘ సభ్యులందరూ పాల్గొన్నారు. కార్యక్రమంలో మేజర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ.... ఆదర్శవంతంగా జీవించాలని పిలుపునిచ్చారు.

రన్ ఫర్ జీసెస్...

షెనాయ్ నగర్‌లోని తిరువిక పార్కు వద్ద బిషప్ డాక్టర్ ఎస్.ప్రకాష్ రాజ్ అధ్యక్షతన ఈస్టర్ సందర్భంగా నిర్వహించిన 'రన్ ఫర్ జీసెస్' ఉత్సాహంగా సాగింది. రెవఎండ్ డాక్టర్ సెల్వం జోసెఫ్, బిషప్ దేవపాలన, బిషప్ ఏబేలు నీలకంఠన్, సీనియర్ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ఎస్.రాజేంద్ర ప్రసాద్, టీవీ ప్రసంగీకులు రెవరెండ్ సుందర్‌రాజ్, జనోదయం ప్రాజెక్ట్ డైరెక్టర్ గొల్లపల్లి ఇశ్రాయేలు తదితరులు పాల్గొన్న ఈ రన్ సుమారు 3 కి.మీ వరకు సాగి అన్నానగర్ ఈస్ట్‌లో ఉన్న మోహన్ విల్లా పార్కు వద్ద ముగిసింది. ఆసియా బాప్టిస్ట్ పాస్టర్స్ ఫెలోషిప్ క్రైస్ట్ ఫర్ ఆల్ మిషన్, తెలుగు క్రిస్టియన్ కాన్ఫరెన్స్ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పెరంబూరు వాటర్‌బరీ మెమోరియల్ బాప్టిస్ట్ సంఘంలో రెవరెండ్ వి.హోరూన్‌ను శాలువతో సత్కరిస్తున్న సీనియర్ పాస్టర్ పాల్ ఈశ్వరప్ప





పెన్షనర్స్ లైన్ తెలుగు బాప్టిస్ట్ చర్చిలో సంఘ విశ్వాసులతో రెవరెండ్ తాటిపర్తి ఐజక్ తదితరులు - విల్లివాక్కం రాజమంగళం రక్షణ సైన్యంలో లెఫ్టినెంట్ కల్నల్ ముద్దా అబ్రహాం లింకన్, మేజర్ నాగేశ్వరరావు రావుతో ప్రత్యేక గీతాలు ఆలపిస్తున్న స్త్రీల సమాజం సభ్యులు

పళని పర్వతాలయంలో బారులు తీరిన భక్తులు



చెన్నై, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యస్వామి కొలువైన ఆరు దివ్యక్షేత్రాల్లో తృతీయ క్షేత్రంగా పేరుగాంచిన పళని పర్వతాలయంలో ఆదివారం భక్తులు రద్దీ పెరిగింది. ఇటీవల ఆ ఆలయంలో పంగుణి ఉత్సవాలు ముగిశాయి. అయినా భక్తుల రద్దీ పెరుగుతూనే ఉంది. గుడ్‌ఫ్రైడే, శని, ఆదివారాలంటూ వరుసగా మూడు రోజులు సెలవు కావటంతో ఆలయానికి వేలసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వీరిలో విద్యార్థులు, యువతీయువకులు అధికంగా ఉన్నారు. సేలం జిల్లా అరిశిపాళయానికి చెందిన సుమారు యాభైమంది భక్తులు వంటికి శూలాలు గుచ్చుకుని పాదయాత్రగా పళని పర్వతాలయానికి విచ్చేశారు. ఇదే విధంగా పలు నగరాల నుండి భక్తులు పవిత్రతీర్థాలు తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు. రద్దీ అధికంగా ఉండటంతో భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. దైవదర్శనానికి సుమారు రెండు గంటలు వేచి ఉండాల్సి వచ్చింది. ఎండలు అధికంగా ఉన్నా దండాయుధపాణిని దర్శించేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

వెల్లియంగిరిలో చెన్నై భక్తుడి మృతి

అడయార్, మార్చి 31: కోయంబత్తూరు జిల్లా వెల్లియంగిరి కొండను ఎక్కిన చెన్నైకు చెందిన భక్తుడు ఊపిరాడక ప్రాణాలు కోల్పోయాడు. ముగప్పేర్‌కు చెందిన రఘురాం (50) మేన్‌పవర్ ఏజెన్సీని నడుపుతున్నారు. ఈయన శనివారం తన స్నేహితులు 15 మందితో కోయంబత్తూరులు వెల్లియంగిరి కొండను ఎక్కేందుకు వచ్చారు. సాయంత్రం 6 గంటల సమయంలో కొండను ఎక్కడం ప్రారంభించగా, అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో ఐదో కొండను ఎక్కుతుండగా ఉన్నట్టుండి రఘురాంకు శ్వాస సమస్య ఉత్పన్నమైంది. తమ స్నేహితుడు ఇబ్బంది పడటాన్ని గమనించిన ఇతర స్నేహితులు స్థానిక అటవీ శాఖ అధికారులకు సమాచారం చేరవేశారు. వెంటనే అక్కడకు చేరుకుని రఘురాంను డోలీలో తెల్లవారుజామున 4 గంటల సమయంలో కిందికి తీసుకొచ్చి, వెంటనే 108 అంబులెన్స్ ద్వారా సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అయితే, రఘురాం అప్పటికే చనిపోయినట్టు వైద్యులు వెల్లడించారు. గత నెల రోజుల్లో ఈ కొండను ఎక్కేందుకు ప్రయత్నించిన భక్తుల్లో ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం గమనార్హం.

ఊటీకి వెళ్లిన గవర్నర్ ఆర్ఎన్ రవి

పెరంబూర్, మార్చి 31: ఐదు రోజుల పర్యటనగా రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి నీలగిరి జిల్లా ఊటీ వెళ్లారు. చెన్నై నుంచి విమానం ద్వారా శనివారం కోయంబత్తూర్ చేరుకున్న గవర్నర్, అక్కడి నుంచి కారులో కోతగిరి కొండ మార్గంగా ఊటీకి చేరుకున్నారు. ఊటీ రాజ్‌భవన్‌లో ఐదు రోజులు బస చేయనున్న గవర్నర్, జిల్లాలో జరగనున్న పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. పర్యటన ముగించిన ఈ నెల 4వ తేది గవర్నర్ తిరిగి చెన్నై చేరుకుంటారని రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి.

డీఎంకే, అన్నాడీఎంకేల మధ్యే పోటీ: ఈపీఎస్



ప్రసంగిస్తున్న అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, మార్చి 31: లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే, అన్నాడీఎంకేల మధ్యే పోటీ ఉంటుందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పేర్కొన్నారు. కడలూరు మంజకుప్పం గ్రౌండ్‌లో శనివారం రాత్రి జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ... కూటమి తరఫున డీఎండీకే అభ్యర్థి శివకొళుందును గెలిపించాలని పిలుపునిచ్చారు. బీజేపీని గెలిపించేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా లేరన్నారు. కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో కూర్చున్నా తమిళనాడుపై సవతి తల్లి ప్రేమ చూపిస్తుంటాయని, అందువల్లే బీజేపీ కూటమి నుంచి అన్నాడీఎంకే బయటకు వచ్చిందన్నారు. అబద్ధాలు చెప్పడంలో నోబుల్ బహుమతి ప్రకటిస్తే స్టాలిన్‌కు ప్రదానం చేయవచ్చని, ఆయన ఇచ్చిన 560 హామీల్లో ఒక్కటి కూడా అమలు పరచకపోవడమే దీనికి కారణమన్నారు. ప్రజాధనాన్ని ప్రకటనల కోసం వెచ్చిస్తున్నారని మండిపడ్డారు.

అనుమతి లేకుండా ప్రచారం

- అన్నామలైపై కేసు

అడయార్, మార్చి 31: ప్రజలకు అసౌకర్యం కలిగించేలా నడిరోడ్డులో నిలబడి ప్రచారం చేసినందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలైపై కడలూరు జిల్లా పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం కడలూరుకు వచ్చిన అన్నామలై పట్టణంలోని పుదునగర్‌లో ప్రచారంలో పాల్గొన్నారు. అయితే, పోలీసుల నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండా ఆయన నడిరోడ్డుపైనే వాహనంలో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ కారణంగా ప్రజలతో పాటు వాహనరాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో అన్నామలై, కడలూరు పీఎంకే అభ్యర్థి తంగర్ బచ్చాన్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు సాయి సురేష్, పార్టీ కడలూరు జిల్లా అధ్యక్షుడు కోవిలూరు మణికంఠన్ తదితరులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రభుత్వ బస్సులు ఢీకొని 1,397 మృతి

పెరంబూర్, మార్చి 31: రెండేళ్లలో ప్రభుత్వ బస్సులు ఢీకొని 1,397 మంది మృతిచెందారు. ఈ మేరకు రాష్ట్ర రవాణా సంస్థ కార్మిక సంఘం కార్యదర్శి కె.అన్బళగన్ సమాచార హక్కు చట్టం కింద దాఖలుచేసిన వినతిపత్రంపై రవాణా సంస్థ బదులు అందించింది. అందులో సేలం, మదురై రీజియన్లు మినహా మిగిలిన వాటిల్లో మృతుల వివరాలను తెలియజేశారు. ఆ ప్రకారం, 2021 జనవరి 1 నుంచి 2023 నవంబరు 30వ తేది వరకు చెన్నై మెట్రోకార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ బస్సులు ఢీకొని 117 మంది, కోయంబత్తూర్ రీజియన్‌లో 245 మంది, తిరునల్వేలిలో 185 మంది, కుంభకోణంలో 398 మంది, విల్లుపురంలో 351 మంది, ఎస్ఈటీసీ బస్సులు ఢీకొని 101 మంది మొత్తం 1,397 మంది మృతి చెందినట్లు రవాణా శాఖ తెలిపింది.

ఎంపీ సీటు రాకుండా అడ్డుకున్న వారికి థ్యాంక్స్!

- కాంగ్రెస్ ఎంపీ తిరునావుక్కరసు



ప్యారీస్, మార్చి 31: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు తనకు సీటు రాకుండా అడ్డుకున్న వారికి కాంగ్రెస్ సిట్టింగ్ ఎంపీ ఎస్.తిరునావుక్కరసు కృతజ్ఞతలు తెలుపుతూ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఐదేళ్లుగా తిరుచ్చి ఎంపీగా తాను ప్రజలకు నిస్వార్థ సేవలందించారని కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో తాను పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి కరోనా మరణాలు తగ్గేందుకు వైద్యులతో కలసి కృషి చేసినట్లు తెలిపారు. తన నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి రూ.17 కోట్లతో 288 పనులను ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పూర్తి చేశానని, కేంద్రీయ విద్యాలయ పాఠశాలలో విద్యార్థులకు కనీసవసతులు మెరుగుపరిచానన్నారు. అయినా ఈ నియోజకవర్గ ప్రజలకు సేవలందించకుండా కొంతమంది అడ్డుకున్నారని, అయినప్పటికీ తాను ప్రజాసేవలో కొనసాగుతానని తిరునావుక్కరసు పేర్కొరు.

డీఎంకే ఎన్నికల కార్యాలయం ప్రారంభం



ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దురైమురుగన్

వేలూరు, మార్చి 31: వేలూరు నియోజకవర్గం డీఎంకే కార్యాలయాన్ని ఆదివారం ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మంత్రి దురైమురుగన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... లోక్‌సభ ఎన్నికల్లో తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లోని 40 నియోజకవర్గాలను డీఎంకే కూటమి చేజిక్కించుకుంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్యే నందకుమార్, ఆనైకట్టు పార్టీ నాయకులు పి.వెంకటేశన్, బాబు, పలువురు నేతలు పాల్గొన్నారు.

ఏటీఎంలో నింపేందుకు తీసుకెళ్తున్న రూ.2 కోట్ల నగదు స్వాధీనం



చెన్నై, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పూందమల్లి సమీపంలో ఎన్నికల సంఘం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు నిర్వహించిన వాహనాల తనిఖీలో రూ.2కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం వేకువజామున కోలప్పన్‌చేరి చెక్‌పోస్టు వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వాహనాల తనిఖీ చేస్తుండగా ఏటీఎం సెంటర్‌కు నగదును తీసుకెళ్లే వాహనాన్ని నిలిపి సోదా చేశారు. ఆ వాహనంలో రూ.2.28 కోట్ల నోట్ల కట్టలు ఉండటంతో వెంటనే వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఆ నగదుకు సంబంధించి ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తెలిపారు. ఆ నగదును పూందమల్లిలోని ప్రభుత్వ సబ్ ట్రెజరీకి తరలించారు. తగిన ఆధారాలు సమర్పించిన తర్వాత ఆ నగదును పొందవచ్చునని అధికారులు తెలిపారు. ఏటీఎంలకు సాయంత్రం ఆరు నుంచి ఉదయం ఆరు గంటల వరకూ నగదు తరలించకూడదని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసిందని, అయినా రాత్రి పూట ఏటీఎంలలో నగదును నింపేందుకు వాహనాల్లో వెళుతున్నారని అధికారులు పేర్కొన్నారు.

బాలికను తల్లిని చేసిన తండ్రి అరెస్టు

అడయార్, మార్చి 31: బాలికను కన్నతండ్రి తల్లిని చేశాడు. ఈ వివరాలను పరిశీలలిస్తే, ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు పోలీసులకు ఫోన్ చేసి, ఆస్పత్రిలో బాలిక ఆడశిశువుకు జన్మనిచ్చిందని దీనిపై విచారణ జరపాలని కోరారు. దీంతో పోలీసులు హాస్పిటల్‌కు చేరుకుని, ఆ బాలిక వద్ద విచారణ చేపట్టారు. తన తండ్రికి దుకాణం ఉందని, సాయంగా ఉండేందుకు వెళ్లేదాన్నని పేర్కొంది. కొన్నేళ్లుగా లైంగికంగా వేధించేవాడని, చివరకు అత్యాచారం చేశాడని తెలిపింది. కుటుంబీకులకు విషయం చెప్పవద్దని బెదిరించినట్టు పేర్కొంది. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు కామాంధుడిని అరెస్టు చేశారు. అతనిపై పోక్సోతో పాటు ఇతర సెక్షన్ల కింద కేసు నమోదు చేసి జైలుకు తరలించారు.

బాలబాలికలకు సుమతి శతకం - వక్తృత్వ పోటీలు

- 14న బహుమతుల ప్రదానం



పోటీల్లో పాల్గొన్న బాలబాలికలతో నిర్వాహకులు

అడయార్, మార్చి 31: శ్రీ క్రోధి నామ ఉగాది పండుగను పురస్కరించుకుని ఉత్తర మద్రాస్ ఉగాది మహోత్సవ కార్యనిర్వాహక వర్గం, సర్ త్యాగరాయ కళాపరిషత్ సంయుక్తంగా ఆదివారం చిన్నారులకు సుమతి శతకం, వక్తృత్వ పోటీలను నిర్వహించాయి. పాత చాకలిపేట, నమశ్శివాయ మొదలి వీధిలో ఉన్న దేవాంగ సంఘ కన్నికలమ్మ ఆలయంలో 12 యేళ్లలోపు బాలబాలికలను మూడు విభాగాలుగా విభజించి పోటీలను నిర్వహించారు. యూకేజీ నుంచి 3వ తరగతి వరకు సబ్ జూనియర్స్‌కు 3 సుమతి పద్యాలు, 4 నుంచి 5వ తరగతి విద్యార్థులకు 5 పద్యాలు, సీనియర్స్ విభాగంలో 6 నుంచి 8వ తరగతి విద్యార్థుల వరకు 8 సుమతి పద్యాలతో ఈ పోటీలను నిర్వహించారు. 46 మంది బాలబాలికలు పాల్గొన్నారు. ఇందులో సబ్ జూనియర్స్ విభాగంలో పూజాశ్రీ, ఏ.నేహా లవిషెట్టి, ఏ.నోవిక, జూనియర్స్ విభాగంలో లక్షిత, గట్సోజెన్, ఏ.రాఘవ్, వి.విదిప్, సీనియర్స్ విభాగంలో జ్ఞానికాశ్రీ, మీనాక్షి, ఏ.అరుణ్ ఈశ్వర్ విజేతలుగా నిలిచారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా మాచర్ల మునిరాజు, బుచ్చయ్య, నరసింహ వ్యహరించారు. అలాగే, చిత్రలేఖనం పోటీల్లో 50 మంది విద్యార్థులు పాల్గొనగా న్యాయనిర్ణేతగా ప్రభురామ్ వ్యవహరించారు. ఈ విజేతలందరికీ ఈనెల 14న ఉగాది పర్వదినాన బహుమతులు ప్రదానం చేస్తామని, ఈ పోటీలను ఉత్తర మద్రాస్ ఉగాది మహోత్సవ కార్యనిర్వాహక వర్గం అధ్యక్షుడు ఎంఆర్ సుబ్రహ్మణ్యం, సర్ త్యాగరాయ కళాపరిషత్ అధ్యక్షుడు డాక్టర్ నందివర్మన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారని, మద్రాస్ హైకోర్టు న్యాయవాది జక్కుల హరికృష్ణ, దేవీ మాధవయ్యలు సంయుక్తంగా విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.



ముమ్మర ప్రచారంలో అన్నాడీఎంకే నేతలు

వేలూరు, మార్చి 31: వేలూరు లోక్‌సభ నియోజకవర్గ ప్రజలు ఆదరణతో తమ విజయం తథ్యమని అన్నాడీఎంకే మానగర జిల్లా కార్యదర్శి ఎస్సార్కే అప్పు తెలిపారు. అన్నాడీఎంకే అభ్యర్థి పసుపతికి మద్దతుగా ఆదివారం కార్పొరేషన్ పరిధిలోని 48వ వార్డులో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా రెండాకులు గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని అప్పు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో పార్టీ నాయకుడు శరవణన్ సహా పలువురు నేతలు, కార్యకర్తలున్నారు.





● ఇది ఆరోసారి బాస్!

9న చెన్నైలో మోదీ రోడ్‌షో

చెన్నై, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయడినికి ప్రధాని నరేంద్రమోదీ ఏప్రిల్ 9న చెన్నైకి విచ్చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే ఆయన ఐదు సార్లు రాష్ట్రంలో పర్యటించి కోయంబత్తూరు, సేలం, మదురై, తిరునల్వేలి, తూత్తుకుడి, కన్నియాకుమారిలో ఏర్పాటైన సభల్లో ప్రసంగించారు. కోయంబత్తూరు సాయిబాబా కాలనీ నుంచి ఆర్‌ఎస్ పురం వరకు రోడ్‌షో చేపట్టారు. ఈ 9న వేలూరు, పెరంబలూరులో ఎన్డీయే అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయనున్నారు. సౌత్ చెన్నై, సెంట్రల్ చెన్నై బీజేపీ అభ్యర్థులు తమిళిసై సౌందరరాజన్, వినోజ్ సెల్వంకు మద్దతులగా ఆయన ఎన్నికల ప్రచారం చేస్తారు. సౌత్ చెన్నైలో వెస్ట్ మాంబళం, సెంట్రల్ చెన్నైలో పాండీబజార్‌ను కలిపే రీతిలో రోడ్‌షోలో ఆయన పాల్గొంటారు. ఉత్తర చెన్నైలోని తిరువొత్తియూరు వడివుడైయమ్మన్ ఆలయాన్ని కూడా ఆయన దర్శించనున్నారు.

ప్రచారంలో సొమ్మసిల్లిన కాంగ్రెస్ అభ్యర్థి

● బాబోయ్ ఎండలు...

చెన్నై, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరిలో ఇండియా కూటమి తరఫున పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి వైద్యలింగం రోడ్‌షోలో ఎండ వేడిమిని తట్టుకోలేక సొమ్మసిల్లిపడ్డారు. ఆదివారం ఉదయం వైద్యలింగం కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. వల్లాలర్ రోడ్డులో నడిచి వెళ్తూ పక్కనే ఉన్న శాసనసభ్యుడు వైద్యనాథన్‌పై వాలిపోయారు. వెంటనే కార్యకర్తలు ఆయన్ను ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి ఎండవేడిమి, బీపీ పడిపోవడంతో సొమ్మసిల్లినట్లు తెలిపారు. సాయంత్రం కార్యకర్తలతో పాటు ఆయన ప్రచారానికి బయలుదేరారు.


సొమ్మసిల్లి పడుతున్న పుదుచ్చేరి కాంగ్రెస్ అభ్యర్థి వైద్యలింగం

● ప్రచారంలో ఇవన్నీ మామూలే!

కాంగ్రెస్ నేతతో అన్నామలై భేటీ

చెన్నై, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై తంజావూరులో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కృష్ణసామి వాండయార్‌ను ఆయన నివాసగృహంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తంజావూరులో ఎన్డీయే అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయడానికి వెళ్లిన అన్నామలై తాను బస చేస్తున్న హోటల్ నుంచి బయలుదేరి అబ్రహాం పండితర్ రోడ్డులో ఉన్న కృష్ణసామి వాండయార్‌ను కలుసుకున్నారు. అన్నామలైకి ఏలకుల మాల వేసి వాండయార్ సాదరంగా ఆహ్వానించారు. ఆ తర్వాత హోటల్‌కు బయలుదేరుతూ అన్నామలై విలేకరులతో మాట్లాడారు. కృష్ణసామి వాండయార్‌ను చాలా కాలంగా చూడాలని అనుకున్నానని, చివరకు ప్రచార పర్యటనలో ఆ కోరిక నెరవేరిందన్నారు. కృష్ణసామివాండయార్ అమ్మామక్కల్ మున్నేట్ర కళగం నాయకుడు టీటీవీ దినకరన్‌కు వియ్యంకుడు.


కాంగ్రెస్ నేత కృష్ణసామివాండయార్‌తో అన్నామలై కబుర్లు

ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతా

● సెంట్రల్ చెన్నై బీజేపీ అభ్యర్థి వినోజ్

చెన్నై, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల తరబడి కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్న సెంట్రల్ చెన్నై ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమే తన ప్రధాన కర్తవ్యమని ఆ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి వినోజ్ పి.సెల్వం అన్నారు. ఆదివారం ఆయన తన ప్రచారంలో... మూడు దశబ్దాలుగా ఈ నియోజకవర్గం అభివృద్ధి గురించి డీఎంకే ప్రభుత్వం పట్టించుకోలేదని, గెలిచిన డీఎంకే కుటుంబ సభ్యులంతా కోట్లకు పడగెత్తారన్నారని విమర్శించారు. నియోజకవర్గంలోని ఆడుదొడ్డి, పులియంతోపు, మింట్ స్ట్రీట్ అంటూ చాలా ప్రాంతాలు ఇప్పటికీ వెనుకబడే ఉన్నాయని చెప్పారు. తన పర్యటనలో సిట్టింగ్ డీఎంకే ఎంపీని తమ ప్రాంతంలో అడుగుపెట్టనీయమని ప్రజలు తెలుపుతున్నారన్నారు. తన ప్రచార పర్యటనకు విచ్చేస్తున్న జనాన్ని చూస్తుంటే ఎన్నికల్లో ఘనవిజయం సాధిస్తామనే నమ్మకం కలుగుతోందన్నారు. నియోజకవర్గంలో నవోదయ పాఠశాలలు, యువకులకు క్రీడా మైదానాలు, ఫుట్‌బాల్ కోచింగ్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.


నియోజకవర్గంలో నటి ఖుష్బూతో కలిసి ప్రచారం చేస్తున్న వినోజ్ పి.సెల్వం

డీఎంకే, బీజేపీ హానికరమైన పార్టీలు!

● ఇది నటి వింధ్య కామెంట్


మదురైలో ప్రచారం చేస్తున్న నటి వింధ్య

చెన్నై, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): డీఎంకే రాష్ట్రానికి, బీజేపీ దేశానికి చేటు కలిగించే ప్రమాదకరమైన పార్టీలని అన్నాడీఎంకే ప్రచార విభాగ డిప్యూటీ కార్యదర్శి, తమిళ సినీ నటి వింధ్య అన్నారు. మదురైలో పోటీ చేస్తున్న అన్నాడీఎంకే అభ్యర్థి డాక్టర్ శరవణన్‌కు మద్దతుగా ప్రచారం చేస్తూ ఎండీఎంకే నేత వైగో తన కుమారుడికి ఒక్క సీటు సంపాదించడం కోసం స్టాలిన్ చుట్టూ ప్రదక్షిణ చేశారని, ఇక స్వార్థపరులైన ఓపీఎస్, దినకరన్ బీజేపీలో చేరి పరువు ప్రతిష్ఠను కోల్పోయారన్నారు. అధికారంలోకి రాగానే నీట్‌ను రద్దు చేసి తీరుతామంటూ గొప్పలు చెప్పిన డీఎంకే ఆ దిశగా చర్యలు చేపట్టలేదన్నారు. రాష్ట్రంలో అన్నాడీఎంకే సానుకూల పవనాలు వీస్తున్నాయని చెప్పారు.

హిందీ తెలిస్తే ఎంపీ... తమిళం తెలిస్తే ఎమ్మెల్యే!

● సీనియర్ మంత్రి దురైమురుగన్

ప్యారీస్, మార్చి 31: హిందీ అనర్గళంగా మాట్లాడగలిగే వారికి పార్లమెంటులో అడుగుపెట్టే అవకాశముంటుందని, తమిళం తెలిస్తే ఎమ్మెల్యే మాత్రమే కాగలుగుతారని డీఎంకే సీనియర్ మంత్రి దురైమురుగన్ అన్నారు. దక్షిణ చెన్నై నియోజకవర్గంలో పోటీ చేస్తున్న డీఎంకే అభ్యర్థి తమిళచ్చి తంగపాండ్యన్‌కు మద్దతుగా జరిగిన ప్రచారంలో దురైమురుగన్ పాల్గొని మాట్లాడారు. పార్లమెంటు ఉభయసభల్లో ప్రజల సమస్యల గురించి ప్రస్తావించాలంటే సభ్యుడికి తప్పనిసరిగా హిందీ, ఆంగ్లం తెలిసుండాలని, ఈ రెండు భాషలు తెలియని వారు శాసనసభకు మాత్రమే రావాలని ఆయన చమత్కరించారు.

● సాగునీటి కోసం రైతుల ఆందోళన

ఓటుకోసం రావొద్దు


తారాపురంలో రైతులు కట్టిన బ్యానర్

చెన్నై, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు జిల్లా ఉప్పారు డ్యాంకు తిరుమూర్తి డ్యాం జలాలను విడుదల చేసి సాగునీటిని అందించాలని కోరుతూ నెల రోజులకు పైగా జరుపుతున్న ఆందోళనను పట్టించుకోని నాయకులకు వ్యతిరేకంగా ఓట్ల కోసం ఊరిలోకి అడుగుపెట్టకూడదంటూ బ్యానర్లు కట్టారు. తిరుప్పూరు జిల్లా తారాపురంలో 6500 ఎకరాలకు గతంలో ఉప్పారు డ్యాం జలాలు విడుదలయ్యేవి. ప్రస్తుతం ఆ డ్యాం అడుగంటింది. దీంతో తిరుమూర్తి డ్యాం నుంచి అదనపు జలాలను ఉప్పారు డ్యాంకు మళ్లించాలని 35 రోజులుగా రైతులు వివిధ రూపాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నా ఏ రాజకీయ పార్టీ నేత రాలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

● వాకింగ్‌లో ఓట్ల వేట

ఈరోడ్ రైతుబజార్‌లో స్టాలిన్


ఈరోడ్ రైతు బజార్‌లో సీఎంతో మహిళల సెల్ఫీ

చెన్నై, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఇండియా కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేస్తున్న డీఎంకే అధ్యక్షుడు, సీఎం స్టాలిన్ ఆదివారం ఉదయం ఈరోడ్‌లోని ఉళవర్ సంతై ఓట్లవేట సాగించారు. ఈరోడ్‌లో పోటీ చేస్తున్న డీఎంకే అభ్యర్థి కేఇ ప్రకాష్‌కు మద్దతుగా ఆయన ప్రచారం చేశారు. లేత నీలిరంగు టీ షర్టు, నలుపు ప్యాంట్ ధరించిన స్టాలిన్ పార్టీ స్థానిక శాఖ నాయకులతో వాకింగ్ వెళ్తూ ఉన్నట్టుండి సంపత్‌నగరంలోని రైతుబజార్‌లోకి వెళ్లారు. కూరగాయల వ్యాపారులు, స్థానికులతో కరచాలనం చేస్తూ నడిచారు. ఆ సందర్భంగా యువతీయువకులు ఆయనతో సెల్ఫీలు తీసుకునేందుకు పోటీపడ్డారు.

శ్రీపెరుంబుదూర్ ఓటర్లు ఎవరిని గెలిపిస్తారో?

ప్యారీస్, మార్చి 31: పరిశ్రమలు అధికసంఖ్యలో ఉన్న శ్రీపెరుంబుదూర్ లోక్‌సభ నియోజకవర్గంలో త్రిముఖ పోటీ నెలకొంది. ఇండియా కూటమి తరఫున డీఎంకే అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ టీఆర్ బాలు, అన్నాడీఎంకే తరఫున ప్రేమ్‌కుమార్, బీజేపీ కూటమిలో టీఎంసీ అభ్యర్థిగా వేణుగోపాల్ పోటీ చేస్తున్నారు. ఈ నియోజకవర్గంలో అనేక విదేశీ సంస్థలు కార్ల తయారీ, వాహన విడిభాగాల ఉత్పత్తి, సెల్‌ఫోన్ తయారుచేసే ఫ్యాక్టరీలతో పాటు, సుమారు 1,000కి పైగా పరిశ్రమలున్నాయి. పరిశ్రమల నగరంగా రాణిస్తున్న శ్రీపెరుంబుదూర్ లోక్‌సభ నియోజకవర్గంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ స్మారక మండపం, భగవద్ రామానుజులు అవతరించిన పుణ్యస్థలంగా ప్రసిద్ధిగాంచిన ఈ నియోజకవర్గంలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో స్థానిక ఓటర్లు ఏ పార్టీని గెలిపిస్తారో.

ఆరు అసెంబ్లీ స్థానాలు...

శ్రీపెరుంబుదూర్ లోక్‌సభ నియోజకవర్గంలో శ్రీపెరుంబుదూర్, ఆలందూర్, పల్లావరం, అంబత్తూర్, మధురవాయల్, తాంబరం అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి.

ఓటర్లు... : జనవరిలో విడుదల చేసిన ఓటరు జాబితా ప్రకారం శ్రీపెరుంబుదూర్‌లో మొత్తం 23,58,526 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారు. వీరిలో పురుషులు 11,69,344 మంది, మహిళలు 11,88,754 మంది కాగా, ఇతరులు 428 మంది ఉన్నారు.

2019 ఎన్నికల ఫలితాలు...

2019వ సంవత్సరం లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే తరఫున పోటీ చేసిన టీఆర్ బాలును విజయం వరించింది.


టీఆర్ బాలు (డీఎంకే): 7,93,281 ఓట్లు
వైద్యలింగం (పీఎంకే): 2,85,326 ఓట్లు
శ్రీధర్ (ఎంఎన్ఎం): 1,35,525 ఓట్లు
మహేంద్రన్ (ఎన్టీకే): 84,979 ఓట్లు
నారాయణన్ (ఏఎంఎంకే) 41,497 ఓట్లు

డీఎంకేదే పైచేయి...

శ్రీపెరుంబుదూర్ లోక్‌సభ నియోజకవర్గంలో 1967లో శివశంకర్(డీఎంకే), 1971లో లక్ష్మణన్(డీఎంకే), 1977లో సీరాళన్ జగన్నాథన్(అన్నాడీఎంకే)లు ఎంపీలుగా గెలిచిరు. 1980 లోక్‌సభ ఎన్నికల్లో నాగరత్నం(డీఎంకే), 1984, 1989, 1991 ఎన్నికల్లో మరగదం చంద్రశేఖర్ (కాంగ్రెస్)విజయం సాధించారు. 1996లో డీఎంకే నేత నాగరత్నం, 1998లో అన్నాడీఎంకే తరఫున డాక్టర్ వేణుగోపాల్ ఎంపీలుగా గెలిచారు. 1999, 2004 ఎన్నికల్లో డీఎంకేకు చెందిన కృష్ణస్వామి, 2009లో డీఎంకే నేత టీఆర్ బాలులు ఎంపీలయ్యారు. 2014లో కేఎన్ రామచంద్రన్ (అన్నాడీఎంకే), 2019 లోక్‌సభ ఎన్నికల్లో టీఆర్ బాలు (డీఎంకే)ను విజయం వరించింది. ఈ స్థానంలో డీఎంకే 8 సార్లు ఘనవిజయం సాధించి తన కంచుకోటగా మార్చుకుంది.


టీఆర్ బాలు (డీఎంకే)


ప్రేమ్‌కుమార్ (అన్నాడీఎంకే)


వేణుగోపాల్ (టీఎంసీ)

చెన్నై శివారులో ఉన్న శ్రీపెరుంబుదూర్ పరిశ్రమల కేంద్రంగా అభివృద్ధి చెందడంతో జనాభా సంఖ్య కూడా పెరుగుతోంది. అందువల్ల ఇక్కడ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించాలన్నది ప్రజల దీర్ఘకాల కోరిక. అడయారు కాలువ ఇరువైపులా ఆక్రమణలు తొలగించాలి, రైళ్ల నడపాలి, ట్రాఫిక్ రద్దీని నియంత్రించేలా పై ఓవర్లు నిర్మించాలి, చెన్నై - బెంగళూరు జాతీయ రహదారిలో ప్రమాదాలను నివారించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అటకెక్కించిన చెంబరంబాక్కం సంయుక్త తాగునీటి పథకాన్ని అమలుపరచాలని ఓటర్లు డిమాండ్ చేస్తున్నారు.

ఎంపీ పూర్తిచేసిన పనులను బైనాక్యులర్‌తో వెతికిన అభ్యర్థి

ప్యారీస్, మార్చి 31: మదురై ఎంపీ వెంకటేశన్ పూర్తి చేసిన పనులపై లోక్‌సభ ఎన్నికలో ఆ స్థానం నుంచి పోటీ చేస్తున్న అన్నాడీఎంకే అభ్యర్థి శరవణన్ వ్యంగోక్తులు విసిరారు. డీఎంకే, అన్నాడీఎంకే, బీజేపీ తదితర ప్రధాన పార్టీలు సహా వందల సంఖ్యలో ఇండిపెండెంట్లు కూడా ఈ సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేయడం వల్ల ఏదైనా కొత్తగా ప్రచారం చేస్తే ఓటర్లు తన వైపు చూస్తారన్న నమ్మకంతో శరవణన్ బహిరంగ సభ వేదికపై హఠాత్తుగా బైనాక్యులర్‌తో కనిపించారు. ఆయన మాట్లాడుతూ... సీపీఎం ఎంపీ వెంకటేశన్ ఐదేళ్లుగా ఈ నియోజకవర్గంలో పూర్తి చేసిన పనులను బైనాక్యులర్ ద్వారా వెతికినా కనిపించలేదని చమత్కరించారు.

మొబైల్ టాయిలెట్ వాహనం ఏర్పాటు చేయండి

● మహిళా కానిస్టేబుళ్ల విజ్ఞప్తి

ప్యారీస్, మార్చి 31: లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పార్టీల అగ్ర నేతలు పాల్గొనే ప్రచార సభలు, బహిరంగ సభల వద్ద భద్రతా విధుల్లో పాల్గొంటున్న మహిళా కానిస్టేబుళ్లు ఎన్నికల కమిషన్‌కు రాసిన లేఖలో... తమ కోసం మొబైల్ టాయిలెట్ వాహనాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రేటర్ చెన్నై పోలీస్ శాఖలో ఉన్న 10 మొబైల్ టాయిలెట్ వాహనాల్లో రెండింటిని ట్రాఫిక్ విభాగానికి కేటాయించారు. ఒక్కొక్క వాహనంలో మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకొనే గది, వాష్‌బేసిన్ తదితర సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల ప్రచార బందోబస్తులో పాల్గొంటున్న మహిళా పోలీసులు వారికి కేటాయించిన ప్రాంతాల్లో గంటల తరబడి విధుల్లో పాల్గొంటున్నారు. అందువల్ల కాలకృత్యాలు తీర్చుకొనేందుకు ప్రచార సభలు నిర్వహించే ప్రాంతాల్లో మొబైల్ టాయిలెట్లు ఏర్పాటుచేయాలని ఆ లేఖలో కోరారు.


నిద్రపోతున్న కాంగ్రెస్ అభ్యర్థి కార్తీ

పరిచయ సభలో నిద్రపోయిన అభ్యర్థి

పెరంబూర్, మార్చి 31: శివకాశి లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి పరిచయ సభ శనివారం సాయంత్రం శివకాశిలో జరిగింది. ఈ సభకు మంత్రి పెరియకరుప్పన్, మాజీ కేంద్ర మంత్రి పి.చిదంబరం, ఇండియా కూటమి పార్టీల నేతలు పాల్గొన్నారు. సభలో పి.చిదంబరం మాట్లాడుతుండగా, నియోజకవర్గ అభ్యర్థి, ఆయన కుమారుడు కార్తీ చిదంబరం కాసేపు కునుకుతీశారు. ఉదయం నుంచి రాత్రి వరకు సుడిగాలి ప్రచారం చేపడుతుండడంతో ఆయన అలసిపోయి కళ్లు మూసుకున్నారని కార్యకర్తలకు నేతలు సర్దిచెప్పారు.

ప్రచారంలో కుటుంబం

పెరంబూర్, మార్చి 31: ధర్మపురి లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ కూటమిలో పీఎంకే అభ్యర్థి సౌమ్య అన్బుమణి పోటీ చేస్తున్నారు. ఆమె ఎన్నికల కార్యాలయ ప్రారంభోత్సం శనివారం జరిగింది. ఆమె మనుమడు, మనుమరాలు ముఖ్యఅతిథులుగా పాల్గొని రిబ్బన్ కత్తిరించి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సౌమ్య అన్బుమణి మాట్లాడుతూ.. ధర్మపురి నియోజకవర్గంలో తొలి మహిళా అభ్యర్థిగా పోటీచేస్తున్న తాను ప్రచారానికి వెళ్లిన ప్రతి చోట ప్రజలు ఆహ్వానిస్తున్నారన్నారు. నియోజకవర్గ సమస్యలు తనకు తెలుసని, తనకు అవకాశం కల్పిస్తే సమస్యలు పరిష్కరించేలా కృషిచేస్తానని ఆమె హామీ ఇచ్చారు.


మనవడు, మనవరాలితో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సౌమ్య అన్బుమణి


రెక్లా బండిపై మంత్రి టీఆర్బీ రాజా

ఓటరు దేవుడి ప్రసన్నం కోసం....

పెరంబూర్, మార్చి 31: కోయంబత్తూర్ లోక్‌సభ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. ఓటర్ల దేవుళ్ల ప్రసన్నం కోసం అభ్యర్థులు అష్టకష్టాలు పడుతున్నారు. ఈ నియోజకవర్గంలో డీఎంకే అభ్యర్థిగా పోటీ చేస్తున్న గణపతి రాజ్‌కుమార్‌కు మద్దతుగా మంత్రి టీఆర్బీ రాజా ప్రచారంలో పాల్గొన్నారు. నియోకవర్గంలో కొండ గ్రామమైన ఆనైకట్టిలో ఇంటింటా ప్రచారం చేపట్టిన ఆయన, గ్రామంలోని వీధుల్లో రెక్లా బండిపై కూర్చొని ప్రజలను ఓట్లు అభ్యర్థిస్తూ ముందుకు సాగారు.

కష్టపడేతత్వం అలవర్చుకోండి

● రిటైర్డ్ జడ్జి కె.కృష్ణన్

యువ కళాకారులు, వర్ధమాన నటీనటులు చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టిన తర్వాత కష్టపడేతత్వాన్ని అలవర్చుకోవాలని మద్రాస్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి కె.కృష్ణన్ పిలుపునిచ్చారు. మహా ఫైన్ ఆర్ట్స్ యునైటెట్ ఆర్టిస్ట్ ఇండియా సంయుక్తంగా ఉత్తమ నటన కనబరిచిన వర్ధమాన నటీనటులను గుర్తించి, అవార్డులను ప్రదానం చేసింది. ప్రేమివెంకట్, వీణ వెంకటేష్, అషిక శరణ్, క్లాసికల్ డ్యాన్సర్ రాజలక్ష్మి మాలిని జయచంద్రన్ తదితరులకు రిటైర్డ్ జడ్జి కె.కృష్ణన్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మహా ఫైన్ ఆర్ట్స్ చైర్‌పర్సన్ డాక్టర్ అనురాధ జయరాం, యునైటెడ్ ఆర్టిస్ట్ ఇండియా ఫౌండర్ నెల్లై సౌందర్ రాజన్, శిఖరం హాల్ అధినేత చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


అవార్డు గ్రహీతలతో నిర్వాహకులు

చిత్రజ్యోతి

జీవితం - కెరీర్‌లో ముఖ్యమైన చిత్రం 'అరణ్మనై'

● దర్శకుడు సుందర్ సి

'అరణ్మనై' చిత్రం తన సినీ కెరీర్‌లోనే కాకుండా, జీవితంలో ఎంతో ముఖ్యమైన మూవీ అని దర్శకుడు సుదర్ సి అన్నారు. ఆయన దర్శకత్వంలో వహించిన 'అరణ్మనై' సిరీస్‌లో రానున్న నాలుగో చిత్రం 'అరణ్మనై-4'. ఈ చిత్ర ట్రైలర్‌ను శనివారం చెన్నైలో విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... "అరణ్మనై' మొదటి భాగాన్ని నిర్మించే సమయంలో సీక్వెల్స్ తీయాలన్న ఆలోచన లేదు. వేరే సినిమా కోసం కథా చర్చల్లో ఉన్నపుడు నా కో రైటర్ కీర్తి ఒక విషయం చెప్పారు. భారతదేశాన్ని పరిపాలించిన అనేక మంది రాజులు వివిధ ప్రాంతాలను ఆక్రమించారు. కానీ, తూర్పు ప్రాంతంలోని బ్రహ్మపుత్ర నది దాటి ఎవరూ వెళ్లలేదు. దానికి అనేక కారణాలు ఉన్నాయని చెబుతున్నారు. అందులో ఒకటి దెయ్యం భయం. దీనికి సంబంధించి అనేక జానపద కథలు ఇప్పటికీ స్థానికులు చెప్పుకుంటారు. ఈ విషయాలను ఈ చిత్రంలో పెట్టాలని భావించాం. గతంలో వచ్చిన 'అరణ్మనై' చిత్రాలకు కంటే భిన్నంగా ఈ సినిమా ఉంటుంది' అని అన్నారు. డాక్టర్ ఏసీ షణ్ముగం ఆశీస్సులతో బెంజ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ ఏసీఎస్ అరుణ్ కుమార్, అవ్ని సినీమాక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఖుష్బూ సమర్పణలో సుందర్ సి దర్శకత్వంలో రూపుదిద్దుకుంది. సుందర్ సి, తమన్నా, రాశీఖన్నా, యోగిబాబు, వీటీవీ గణేష్, ఢిల్లీ గణేష్, కోవై సరళ ప్రధాన పాత్రలను పోషించారు. ఈ.కృష్ణస్వామి దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి హిప్‌హాప్ తమిళ ఆది సంగీతం అందించారు. త్వరలోనే విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు. కాగా, ఈ ట్రైలర్ లాంచ్ వేడుకలో హీరోయిన్లు తమన్నా, రాశీఖన్నా, నటి ఖుష్బూ, నటులు యోగిబాబు, వీటీవీ గణేష్, జయప్రకాష్, హిప్‌హాప్ ఆది తదితరులు పాల్గొని ప్రసంగించారు.


తమన్నా, సుందర్ సి, రాశీఖన్నా


వధువు కోసం గంజాకరుప్పు అన్వేషణ!

ప్రముఖ కవి, సినీ గేయ రచయిత జయంకొండన్ త్వరలోనే ఓ ఇంటివాడయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇందు కోసం ఆయన తనకు అనుకూలమైన వధువు కోసం గాలిస్తున్నారు. జయంకొండన్‌కు అనుకూలమైన యువతి కోసం అన్వేషించే పనుల్లో నటుడు గంజాకరుప్పు కూడా నిమగ్నమైవున్నారు. తనకు తెలిసినవారి ద్వారా వధువు వివరాలను సేకరిస్తున్నారు. కేకేనగర్‌లో కవింజ్ఞర్ కిచన్ పేరుతో జయంకొండన్ రెస్టారెంట్ నడుపుతున్నారు. ఈ రెస్టారెంట్‌కు రెగ్యులర్ కస్టమర్లు హీరో విజయ్ అంటోని, నటులు పార్తిబన్, గంజాకరుప్పు, అప్పుకుట్టి, మనీష్‌కాంత్, బరోటా సూరి, కాళి వెంకట్ ఉన్నారు. వీరంతా కలిసి జయంకొండన్ ఓ ఇంటివాడిని చేసేందుకు చర్యలు చేపట్టారు. ఇందులోభాగంగా, వధువును చూసే బాధ్యతను గంజా కరుప్పు స్వీకరించారు. మంచి వధువు తారసపడితే ఆమె జయంకొండన్ వివాహం చేయించేందుకు వారంతా సిద్ధంగా ఉన్నారు. ఇదిలావుండగా గంజాకరుప్పు కూడా ఊరపాక్కంలో 'కవింజ్ఞర్ కిచెన్' పేరుతో ఒక రెస్టారెంట్‌ను ప్రారంభించి దాని నిర్వహణ బాధ్యతలను కూడా జయంకొండన్‌కే అప్పగించాలని నిర్ణయించారు.


కవి జయంకొండన్‌తో గంజాకరుప్పు

దిక్సూచి
DIKSUCHI

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం



కన్ను గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఆప్తాల్మాలజీ అంటారు. కన్ను దృష్టికి సంబంధించిన జ్ఞానాంగం. పుర్రెలోని నేత్రగుళికలో కన్ను ఇమిడి ఉంటుంది. కన్నులో నేత్రగోళం, అనుబంధ నిర్మాణాలు(కనురెప్పలు, కంటి పక్ష్మాలు, కనుబొమ్మలు, అశ్రు పరికరం, వెలుపలి కండరాలు) ఉంటాయి. అశ్రు పరికరంలోని నిర్మాణాలు, కన్నీటిని ఉత్పత్తి చేస్తుంది. కన్నీటిలో లవణాలు, శ్లేష్మం, సూక్ష్మ జీవనాశక ఎంజైమ్ లైసోజోమ్ ఉంటాయి. నేత్రగుళికలో నేత్రగోళం కదలిక ఆరు కండరాల సహాయంతో జరుగుతుంది.

నేత్రగోళపు పొరలు

నేత్రగోళ కుడ్యంలో మూడు పొరలు ఉంటాయి. అవి ఒక దాని వెనక ఒకటి ఉంటాయి. అవి- 1) తంతు పటలం 2) ప్రసరణ పటలం 3) రెటీనా

తంతు పటలం: ఇది నేత్రగోళం వెలుపలి పొర. దీని పూర్వాంతంలో కార్నియా, పరాంతంలో దృఢస్తరం(స్క్లీరా) ఉంటాయి. కార్నియా రక్తనాళరహిత పారదర్శక పొర, ఇది స్థిరకటకంగా ఉండి ఐరిస్‌ను కప్పుతుంది. కార్నియాను ఆవరించి కంజెక్టివా ఉంటుంది. నేత్రదాన ప్రక్రియలో కార్నియాను మాత్రమే సేకరిస్తారు. మృతిచెందిన వ్యక్తి నుంచి నేత్రాలను ఆరుగంటల లోపు తీసుకోవాల్సి ఉంటుంది. స్క్లీరా అనేది కంటిలోని తెల్లని భాగం. ఇది అంతర్భాగాలకు రక్షణనిస్తుంది.

ప్రసరణ పటలం: దీనిని యూవియా అని కూడా పిలుస్తారు. ఇది నేత్రగోళం మధ్యపొర. దీనిలో మూడు భాగాలుంటాయి. అవి- ఎ) కొరాయిడ్ బి) సిలియరి బాడీ సి) ఐరిస్. కొరాయిడ్ అనేది విరివిగా రక్తనాళాలతో కూడి నీలివర్ణంలో ఉంటుంది. సిలియరిబాడీలోని నునుపు కండరాలు కంటి కటకాన్ని నిర్దిష్టస్థానంలో ఉంచడానికి, కటకం ఆకారాన్ని హ్రస్వదృష్టి, దీర్ఘదృష్టికి అనుకూలంగా మార్చడానికి ఉపయోగపడతాయి. ఐరిస్ అనేది నేత్రగోళంలోని వర్ణక ప్రాంతం. ఇది కార్నియాకు కటకానికి మధ్య సస్పెండెడ్‌గా ఉంటుంది. ఐరిస్ మధ్యలో కనుపాప ఉంటుంది. ఇది కెమెరాలోని డయాఫ్రమ్‌లా పనిచేస్తుంది. రాత్రిపూట సంచరించే నిశాచర జీవుల్లో ఐరిస్ పైన పడిన కాంతి పరావర్తనం చెందడం వల్ల వాటి కళ్లు మెరుస్తాయి.

రెటీనా: ఇది నేత్రగోళంలోని లోపలిపొర. దీనిలో పిగ్మెంటెడ్ ఎపిథీలియం, నాడీప్రాంతం అనే రెండు భాగాలుంటాయి. పిగ్మెంటెడ్ ఎపిథీలియం అనేది ఒక మెలనిన్ ఆచ్ఛాదం. నాడీ ప్రాంతంలో ఫోటోరిసెప్టార్ లేయర్, బైపోలార్ సెల్ లేయర్, గాంగ్లియాన్ సెల్ లేయర్ అనే మూడు పొరలుంటాయి. ఫోటోరిసెప్టార్ లేయర్‌లో రాడ్స్, కోన్స్ అనే రెండురకాల కాంతి గ్రాహకాలు ఉంటాయి. రాడ్స్, కోన్స్ మధ్య నిష్పత్తి 15:1. రాడ్స్ అనేవి రొడాప్సిన్ అనే వర్ణకాన్ని కలిగి ఉంటాయి. రాడ్ సెల్ అతి తక్కువ కాంతిలో అనగా చీకటిలో వస్తువులను చూడటానికి పనికొస్తాయి. కానీ వివిధ రంగులను గుర్తించలేవు. కోన్ సెల్స్‌లో అయోడాప్సిన్ అనే వర్ణక పదార్థం ఉంటుంది. కోన్‌సెల్స్ కాంతివంతమైన వెలుతురులో వస్తువులను చూడటానికి ఉపయోగపడతాయి. ఇవి రంగులను గుర్తిస్తాయి. రెటీనా పరాంత మధ్య భాగాన్ని మాక్యులాల్యూటియా లేదా పసుపుచుక్క అంటారు. పసుపు చుక్కలో కోన్‌సెల్స్ అధికంగా ఉంటాయి. కంటిలో ప్రతిబింబం ఏర్పడే ప్రాంతమే ఈ పసుపు చుక్క.

నేత్రగోళం నుంచి వార్తలను మెదడుకి చేరవేసే నాడిని దృక్ నాడి అంటారు. రెటీనాతో దృక్‌నాడి కలిసే ప్రాంతాన్ని బ్లైండ్ స్పాట్ అంటారు. దీనిలో ఏవిధమైన కాంతి గ్రాహకాలు ఉండవు. అందువల్ల ఈ ప్రదేశంలో ప్రతిబింబాలు ఏర్పడవు. రెటీనాను కెమెరాలోని ఫిల్మ్‌తో పోల్చవచ్చు. నేత్రగోళ కుహరంలో ఐరిస్ వెనుక ద్వికుంభాకార కటకం ఉంటుంది. ఇది సర్దుబాటు చేసుకునే కటకం. దీనిని కెమెరాలోని కటకంతో పోలుస్తారు. చూసే వస్తువు దూరాన్ని బట్టి ఈ కటకం తన నాభ్యాంతరాన్ని మార్చుకుంటుంది. కన్ను లోపలి భాగాన్ని కటకం పూర్వాంతపు, పరాంత కక్ష్యలుగా విభజిస్తుంది. పూర్వాంతపు కక్ష్యను ఆక్వియస్ చాంబర్ అని, పరాంతపు కక్ష్యను విట్రియస్ చాంబర్ అని అంటారు. ఆక్వియస్ చాంబర్‌లోని ద్రవం కటకానికి, కార్నియాకి పోషక పదార్థాలను అందిస్తుంది. విట్రియస్ చాంబర్‌లోని ద్రవం అంతరనేత్ర ఒత్తిడిని స్థిరంగా ఉంచి నేత్రగోళం ఆకారాన్ని కాపాడుతుంది.

కన్ను పనిచేసే విధానం

కన్ను కాంతిని సేకరించి కుంభాకార కటకం ద్వారా కేంద్రీకరించి, కంటిలో వెనుక భాగాన ఉండే రెటీనాపై ప్రతిబింబాన్ని ఏర్పరుస్తుంది. కటకం వల్ల ఏర్పడే ప్రతిబింబంలో ఎడమ కుడిగాను, తలకిందులుగాను ఉంటుంది. మెదడులోని జ్ఞానకేంద్రాల్లో పటాలన్నీ సాధారణంగా తిరగబడి, తలకిందులుగా అవుతాయి. నాడీ కణాలన్నీ కట్టలా కలిసి, కంటి నుంచి దృష్టి సమాచారాన్ని మెదడుకు పంపించే దృక్ నాడిని ఏర్పరుస్తాయి. రెండు కళ్లూ సేకరించిన రెండు దృశ్యాలను కలిపి ఒక త్రిమితీయ పటంగా మెదడు తయారుచేస్తుంది. కంటిగుడ్డులో మన కంటికి కనిపించే భాగం 1/6వ వంతు మాత్రమే. కంటికి, టీవీకి మధ్యదూరం 2 1/2 మీటర్లు లేదా ఆరు అడుగులు ఉండాలి. కంటికి, పుస్తకానికి మధ్య దూరం 30 సెం.మీ. ఉండాలి. ఒక ప్రతిబింబం ముద్ర రెటీనా మీద ఉండే సమయం 1/6 సెకన్లు మాత్రమే. కంటిచూపు లేనివారిని అంధులు అంటారు. లూయిస్ బ్రెయిలీ స్పర్శ ద్వారా చదివే బ్రెయిలీ లిపిని అంధుల కోసం కనుగొన్నారు. ఈయన ఫ్రెంచ్ దేశీయుడు. అంధుల కోసం ఆరు చుక్కల బ్రెయిలీ లిపిని ఆవిష్కరించారు.


కె. నాగశేషులు
బయాలజీ ఫ్యాకల్టీ

జమిలి ఎన్నికలు
వివిధ కమిటీల సిఫార్సులు



'జమిలి/ ఏకకాల ఎన్నికలు' అనగా లోక్‌సభ, రాష్ట్ర శాసన సభలు, పట్టణ/ గ్రామీణ స్థానిక సంస్థలన్నింటికీ ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం. అధికారపక్ష బీజేపీ మానిఫెస్టో అంశమైన జమిలి ఎన్నికల సాధ్యాసాధ్యాల పరిశీలనకు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధ్యక్షతన నియమించిన ఉన్నతస్థాయి కమిటీ 2024 మార్చి 14న జమిలి ఎన్నికలను సిఫార్సు చేస్తూ నివేదిక సమర్పించడంతో ఈ అంశం మరోసారి చర్చనీయాంశం అయింది.

ఈ నేపథ్యంలో రామ్‌నాథ్ కోవింద్ కమిటీ సిఫార్సులు, జమిలి ఎన్నికలపై గతంలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ, లా కమిషన్‌లు, ఎలక్షన్ కమిషన్ వెల్లడించిన అభిప్రాయాలు, జమిలి ఎన్నికల వల్ల లాభనష్టాలను పరిశీలించాల్సిన అవసరం ఉంది.

రామ్‌నాథ్ కోవింద్ కమిటీ సిఫార్సులు

ప్రభుత్వం జమిలి ఎన్నికలపై సిఫార్సుల కోసం మాజీ రాష్ట్రపతి కోవింద్ అధ్యక్షతన, ఎనిమిదిమంది సభ్యులతో ఒక ఉన్నత స్థాయి కమిటీని(హెచ్ఎల్‌సీ) నియమించింది. దీనినే 'వన్ నేషన్, వన్ ఎలక్షన్ కమిటీ'గా కూడా వ్యవహరిస్తారు. ఈ కమిటీకి ఛైర్మన్‌గా రామ్‌నాథ్ కోవింద్ ఉండగా సభ్యులుగా అమిత్‌షా(కేంద్ర హోంమినిస్టర్), హరీష్ సాల్వే(సీనియర్ అడ్వకేట్), సుభాష్ కాశ్యప్(లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్), ఎన్.కె.సింగ్(కేంద్ర 15వ ఆర్థికసంఘం మాజీ ఛైర్మన్), సంజయ్ కొఠారి (సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ మాజీ కమిషనర్), గులాం నబీ ఆజాద్(రాజ్యసభ మాజీ ప్రతిపక్ష నాయకుడు), అధిర్ రంజన్ చౌదరి(లోక్‌సభ కాంగ్రెస్ నాయకుడు- ఈయన కమిటీలో ఉండటానికి నిరాకరించారు) ప్రత్యేక ఆహ్వానితులుగా కేంద్ర న్యాయశాఖమంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ ఉంటారు. లా సెక్రటరీ ఈ కమిటీకి సెక్రెటరీగా వ్యవహరిస్తారు.

ఈ కమిటీ మొత్తం 65 సమావేశాలు నిర్వహించి, 18,626 పేజీల నివేదికను 2024 మార్చి 14న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమర్పించింది. ఈ కమిటీ జమిలి ఎన్నికలను ఏకగ్రీవంగా సమర్థిస్తూ వాటిని జరపడానికి చేపట్టాల్సిన సముచిత చర్యలు, రాజ్యాంగ సవరణలు, ఎదురుకానున్న కొన్ని కీలక సమస్యలకు పరిష్కార మార్గాలను సూచిస్తూ ఒక సమగ్ర నివేదికను రూపొందించింది.

లా కమిషన్ సిఫార్సులు(2018)

1999, 2018ల్లో లా కమిషన్లు జమిలి ఎన్నికల ఆవశ్యకత గుర్తిస్తూ ఇంచుమించుగా ఒకే సిఫార్సులు చేశాయి. అవి-

- జమిలి ఎన్నికల వల్ల ప్రజాధనం ఆదా అవుతుంది. ప్రభుత్వ వర్గాలపై భద్రతా బలగాలపై పనిభారం తగ్గుతుంది.
- ప్రభుత్వ పథకాలు, పాలన నిరంతరాయంగా కొనసాగేందుకు అవకాశం ఉంటుంది.
- ప్రస్తుతం ఉన్న రాజ్యాంగంలో కనీసం అయిదు సవరణలన్నా చేయాల్సి ఉంటుంది. 50 శాతం రాష్ట్రాలు ఈ సవరణలకు ఆమోదం తెలపాలి.
- ప్రజా ప్రాతినిధ్యచట్టం(1951), లోక్‌సభ, అసెంబ్లీల నియమ నిబంధనల్లో కూడా మార్పులు తేవాలి.
- అవిశ్వాస తీర్మానాలు నెగ్గడం లేదా గడువుకు ముందే ప్రభుత్వాలు రద్దును కోరినప్పుడు మిగతా కాలం ప్రభుత్వాలు కొనసాగేందుకు ఏంచేయాలి అన్నది జమిలి విధానానికి ఉన్న ప్రధాన అవరోధం.
- ఒక ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు, ఏ ప్రభుత్వం కొనసాగుతుందో చెప్పే విశ్వాస తీర్మానం కూడా నెగ్గాల్సి ఉండటం వంటి ఏర్పాట్లు ఉండాలి.

కమిటీ సిఫార్సుల్లో ప్రధానాంశాలు

1. తొలుత లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికలు జరిపి, ఈ ఎన్నికలు పూర్తయిన వందరోజుల్లోగా స్థానిక సంస్థలకు ఎన్నికలు జరపాలి.
2. ఎప్పటినుంచి జమిలి ఎన్నికలు అమల్లోకి రావాలనే విషయాన్ని సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తరవాత ఎన్నికయ్యే కొత్త ప్రభుత్వం నిర్ణయిస్తుంది.
3. జమిలి ఎన్నికలను తొలిసారి జరిపేటప్పుడు ఒక అపాయింటెడ్ డేట్‌ను నిర్ణయించాలి. అప్పటికి లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల శాసనసభ కాలపరిమితి ముగిసినట్లు భావించవచ్చు. ఇక్కడ అయిదు సంవత్సరాల కాలపరిమితిలో హెచ్చుతగ్గులతో సంబంధం లేకుండా స్థిరీకరించవచ్చు.
4. హంగ్‌హౌస్ లేదా అవిశ్వాస తీర్మానం నెగ్గడం వంటి సందర్భాల్లో మరలా ఎన్నికలు నిర్వహిస్తారు. అయితే మిగిలిన కాలపరిమితి వరకే ఆ ప్రభుత్వాలు కొనసాగుతాయి. ఈవిధంగా కేంద్ర, రాష్ట్ర స్థాయుల్లో ప్రభుత్వాల పాలన కాలాన్ని సమాంతరం చేయవచ్చు.
5. జమిలి ఎన్నికలను ప్రవేశపెట్టడానికి కొన్ని రాజ్యాంగ ప్రకరణలను సవరించడంతోపాటు, కొన్ని అంశాలపరంగా కనీసం సగం రాష్ట్రాల ఆమోదం సాధించాల్సి ఉంటుంది. రాష్ట్రాల శాసనసభల కాలావ్యవధికి సంబంధించిన రాజ్యాంగ ప్రకరణ 172, లోక్‌సభ కాలావధికి సంబంధించిన రాజ్యాంగ ప్రకరణ 83లను సవరించాలి. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర శాసనసభలతోపాటు స్థానిక సంస్థలకు కూడా ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు విధివిధానాలు గల ఒక కొత్త ప్రకరణను, ప్రకరణ 324కు జోడించి 324(ఎ)ను రూపొందించాలి.
6. కేంద్ర, రాష్ట్రాలకు, స్థానిక ప్రభుత్వాలకు కలిపి సంయుక్తంగా ఒకే ఓటర్ల జాబితా ఉండాలి. దానికోసం కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్లతో కలిసి 'యూనిఫైడ్ ఎలక్టోరల్ రోల్'ను ఏర్పాటుచేసి, ఒకే ఓటరు ఐడీ కార్డును జారీ చేయాల్సి ఉంటుంది. దీనికోసం రాజ్యాంగ ప్రకరణ 325లో మార్పులు చేయాల్సి ఉంటుంది. ఈ సవరణలకు కనీసం సగం రాష్ట్ర ప్రభుత్వాల మద్దతు అవసరం.

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ, లా కమిషన్, ఎలక్షన్ కమిషన్ అభిప్రాయాలు

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ(2015) సూచనలు

- వేర్వేరు ఎన్నికలు అధికవ్యయంతో కూడుకున్నవి.
- తరచూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి(ఎంసీసీ) అమలులోకి రావడంతో పాలసీ పెరాలసిస్(పథకాల స్తంభన) ఏర్పడుతుంది. దీనితో అత్యవసరంగా చేపట్టాల్సిన పాలన చర్యలకు అవరోధాలు కలుగుతున్నాయి.
- తరచూ ఎన్నికలతో మానవ వనరులపై అధిక పనిభారం, ఒత్తిడి పెరుగుతుంది.
- జమిలి ఎన్నికలు దేశవ్యాప్తంగా ఒకేసారి కన్నా కొంత వ్యవధితో రెండు దఫాలుగా జరపడం ఆచరణ సాధ్యంగా ఉంటుంది.
- తమ కాలవ్యవధి పూర్తిచేసుకునే సమయం ఆధారంగా రాష్ట్రాలను వర్గీకరించి ఒక ఏడాదిలో రెండు దఫాలుగా తొలుత ఎన్నికలు జరపాల్సి ఉంటుంది. జమిలిని ప్రవేశపెట్టిన మొదటి సంవత్సరం పాలన కాలం కొన్ని రాష్ట్రాలకు అధికం కావచ్చు. మరికొన్ని రాష్ట్రాలకు తగ్గనూవచ్చు.
- రాష్ట్రాలపై ప్రభావం ఉంటుంది కావున కనీసం 2/3వ వంతు రాష్ట్రాల ఆమోదం కావాలి.
- అవిశ్వాస తీర్మానంతోపాటు, విశ్వాస తీర్మానం కూడా(ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఎన్నుకుంటూ) ఏకకాలంలో ఆమోదించేటప్పుడు ఉంటేనే జమిలి విధానం సాధ్యం.

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

ఎలక్షన్ కమిషన్ అభిప్రాయం

జమిలి ఎన్నికలకు పెద్దఎత్తున ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు, ఓటరు వెరిఫైయబుల్ పేపర్ ఆడిట్ ట్రైల్(వీవీపీఏటీ) అవసరమవుతాయి. ప్రస్తుతం ఉన్నవాటికి అదనంగా రెండింతలు, మొత్తంగా 30 లక్షల ఈవీఎంఎస్, వీవీపీఏటీలు అవసరమవుతాయని పేర్కొంది.

అయితే జమిలి ఎన్నికలు నిర్వహించేందుకు తాము సిద్ధమేనని, ఇది ఎలక్షన్ కమిషన్‌పై గణనీయంగా భారం తగ్గిస్తుందని 2022లోనే ప్రధాన ఎలక్షన్ కమిషనర్ సుశీల్‌చంద్ర సంసిద్ధత వ్యక్తం చేశారు. నిజానికి 1983లోనే ఎలక్షన్ కమిషన్ జమిలి ఎన్నికల ప్రస్తావన తెచ్చింది. కానీ అప్పటి ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేయలేదు.

ఈ జమిలి విధానం గతంలో భారతదేశ స్వాతంత్ర్యానంతరం జరిగిన నాలుగు వరుస సార్వత్రిక ఎన్నికల్లో(1952, 1957, 1962, 1967ల్లో) పాటించారు. కారణం, అప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తికాలంపాటు కొనసాగడం. కానీ, 1957లో కేరళలో అధికారంలోకి వచ్చిన వామపక్ష ప్రభుతాన్ని, ప్రకరణ 356ను ప్రయోగించి కేంద్రప్రభుత్వం రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించింది. 1960లో తిరిగి కేరళ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించారు. దీనితో కేంద్ర, రాష్ట్రాల్లో ఒకేసారి ఎన్నికలు నిర్వహించే విధానానికి గండిపడింది. 1967 ఎన్నికల్లో చాలా రాష్ట్రాల్లో(బిహార్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్, పశ్చిమబెంగాల్, ఒరిస్సా) కాంగ్రెసేతర ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. అయితే వాటిలో చాలావరకూ పూర్తికాలం కొనసాగకుండానే రద్దవడంతో 1967 తరవాత జమిలి ఎన్నికలు సాధ్యపడలేదు.


ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

(మిగతా రేపటి దిక్సూచిలో)

రాష్ట్రాన్ని ఆదుకునే ఎన్నారైలపై ఇంత అక్కసా?

▸▸ కోమటి జయరామ్



అమరావతి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఆపద సమయాల్లో ఆపన్న హస్తం అందించే ఎన్నారైలపై వైసీపీ నాయకులు తీవ్ర విమర్శలు చేయడం, బెదిరింపులకు పాల్పడటం అత్యంత దారుణమని ప్రముఖ ప్రవాసాంధ్రుడు, ఎన్నారై టీడీపీ అమెరికా కోఆర్డినేటర్ కోమటి జయరామ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ప్రవాస భారతీయులు ఎన్నికల సమయంలో వచ్చి గ్రామాల్లో గొడవలు సృష్టిస్తే మాత్రం.. వారు ఏ దేశాల నుంచి వచ్చారో తిరిగి అక్కడికి వెళ్లడానికి వీల్లేకుండా చేస్తాం' అంటూ బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు చేసిన బెదిరింపు వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఏపీకి అన్ని విధాలా సాయం చేస్తున్న ఎన్నారైలను ఇలాంటి వ్యాఖ్యలతో అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి బెదిరింపులకు పాల్పడుతున్న అశోక్‌బాబుపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏ దేశమేగినా ఎందు కాలిడినా పొగడరా నీజాతి నిండు గౌరవమూ అన్న గురజాడ స్ఫూర్తిని అణువణువునా నింపుకొన్న ప్రవాసాంధ్రులు విభజిత ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి తమ వంతు కర్తవ్యంగా అనేక కార్యక్రమాలు చేస్తున్నారని, నిధులు ఇస్తున్నారని, పాఠశాలలను దత్తత తీసుకుంటున్నారని తెలిపారు. పల్లెల్లో వైద్య, ఆరోగ్య సేవలను మెరుగుపరుస్తున్నారని, పన్నులు కూడా కడుతున్నారని పేర్కొన్నారు. పరిశ్రమల స్థాపన ద్వారా రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని, విద్యను అందిస్తున్నారని తెలిపారు. కరోనా సమయంలో ప్రభుత్వానికి సమాంతరంగా అనేక కార్యక్రమాలు చేపట్టి రోగులను ఆదుకున్నారని వివరించారు.

రేపు తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనం రద్దు


తిరుమల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నెల తొమ్మిదో తేదీన ఉగాది ఆస్థానం సందర్భంగా మంగళవారం శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం (ఆలయ శుద్ధి) నిర్వహించనున్నారు. ఉదయం 6 నుంచి 11 గంటల వరకు ఈ కార్యక్రమం జరగనుండటంతో వీఐపీ బ్రేక్‌ను టీటీడీ రద్దు చేసింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఇప్పటికే ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను రద్దు చేసిన విషయం తెలిసిందే. ప్రొటోకాల్ పరిధిలో స్వయంగా వచ్చే వీఐపీలకు, ట్రస్టు దాతలకు మాత్రమే బ్రేక్ దర్శన టికెట్లను జారీ చేస్తున్నారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నేపథ్యంలో వీటిని కూడా రద్దు చేస్తున్నట్టు టీటీడీ తెలిపింది.

15 రోజుల్లో శ్రీవాణి ట్రస్టుకు 22.75 కోట్లు

ఎన్నికల కోడ్ నేపథ్యంలో తిరుమల శ్రీవారి శ్రీవాణి ట్రస్టుకు గడిచిన 15 రోజుల్లో రూ.22.75 కోట్ల విరాళాలు అందాయి. ఎన్నికల కోడ్ కారణంగా మార్చి 16వ తేదీ నుంచి వీఐపీ బ్రేక్ సిఫారసు లేఖలను టీటీడీ రద్దు చేసింది. ఈ క్రమంలో శ్రీవాణి ట్రస్టుకు రూ.10 వేల విరాళం అందించి రూ.500 బ్రేక్ దర్శన టికెట్లను కొనుగోలు చేసే వారి సంఖ్య పెరిగింది. తిరుమలలో ఇచ్చే ఆఫ్‌లైన్ కోటా కూడా పెంచి కౌంటర్లను రెండు నుంచి నాలుగుకు పెంచారు. దీంతో 15 రోజుల్లో 22,752 శ్రీవాణి టికెట్లను కొనుగోలు చేయగా, రూ.22.75 కోట్లు ట్రస్టుకు జమయ్యాయి.

సైబర్ బానిసలు!
కంబోడియాలో దుర్భర స్థితిలో 5000 మంది భారతీయులు

న్యూఢిల్లీ, మార్చి 31: "మీ పేరు మీద విదేశాల నుంచి ఒక పార్సిల్ వచ్చింది. దానికి ఆ పన్నులు కట్టాలి.. ఈ పన్నులు కట్టాలి" అంటూ రూ.లక్షల్లో, రూ.కోట్లల్లో దోచుకునే సైబర్ స్కామ్‌ల గురించి వినే ఉంటారు! ఈ తరహా సైబర్ కుంభకోణాల బాధితులైతే.. తమకు కాల్ చేసి బెదిరించినవారిని దారుణంగా తిట్టుకుంటారు. కానీ.. ఈ దందాలో భాగస్వాములై అమాయకులకు కాల్ చేస్తున్నవారిలోనూ కొందరు బాధితులు ఉంటారని తెలుసా? కంబోడియా కేంద్రంగా సాగుతున్న ఈ తరహా సైబర్ ఫ్రాడ్ ఇందుకు నిదర్శనం. కేవలం ఈ ఫ్రాడ్ చేయడం కోసమే.. ఉద్యోగావకాశాల పేరుతో భారతీయులకు ఎర వేసి, వారిని అక్కడికి తరలించి.. వారితో సైబర్ ఫ్రాడ్‌లు చేయిస్తూ.. చేయనంటే కరెంటు షాకులతో దారుణంగా హింసిస్తున్న దందా ఇది. దాదాపు 5000 మంది భారతీయులు ఈ మాఫియా చేతికి చిక్కి.. రోజుకు 12 గంటలకు పైగా పనిచేస్తూ దుర్భరపరిస్థితుల్లో జీవితం గడుపుతున్నట్టు కంబోడియాలోని భారతీయ రాయబార కార్యాలయానికి ఇటీవలికాలంలో ఫిర్యాదులు అందాయి. దీంతో.. అక్కడున్న మనవారిని కాపాడి, ఇక్కడికి తీసుకొచ్చేందుకు కంబోడియా, భారతదేశ ప్రభుత్వాలు ఉమ్మడి ఆపరేషన్ చేపట్టాయి. ఈ విషయాన్ని మన విదేశాంగ శాఖ ఒక ప్రకటన ద్వారా వెల్లడించింది. "ఉద్యోగావకాశాల పేరుతో తమను ప్రలోభపెట్టి.. తీరా కంబోడియాకు తీసుకొచ్చాక సైబర్ నేరాలు చేయాలంటూ తమపై ఒత్తిడి తెస్తున్నారంటూ బాధితులు కంబోడియాలోని మా రాయబార కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. మీడియా కథనాల ద్వారా కూడా కంబోడియాలోని భారతీయుల దుస్థితి గురించి మా దృష్టికి వచ్చింది." అని విదేశాంగ శాఖ ఆ ప్రకటనలో వివరించింది. ఇప్పటిదాకా ఆ మాఫియా నుంచి 250 మంది భారతీయులను కాపాడి, మనదేశానికి తరలించినట్టు వెల్లడించింది. ఉద్యోగాల కోసం కంబోడియాకు వెళ్లి సైబర్ మాఫియా వలకు చిక్కిన మనోళ్ల పని.. అక్కణ్నుంచీ ఇక్కడికి ఫోన్ చేసి భారతీయులను మోసగించడమే. "మీకు ఫలానా దేశం నుంచి ఒక పార్శిల్ వచ్చింది. దాంట్లో మాదక ద్రవ్యాలు ఉన్నాయి (లేదా) అనుమానాస్పద వస్తువులు ఉన్నాయి. ఈడీ/ సీబీఐ/ఐటీ అధికారులు మీ మీద నిఘా పెట్టారు. మీరు అర్జెంటుగా జరిమానా/పన్ను చెల్లించాలి. అలా చెల్లించకపోతే అధికారులు మిమ్మల్ని అరెస్ట్ చేస్తారు" అంటూ బెదిరించడమే. ఆ బెదిరింపులకు భయపడిన చాలా మంది.. వారు అడిగిన డబ్బులు చెల్లిస్తున్నట్టు నిత్యం వార్తల్లో చూస్తూనే ఉన్నాం. ఇలా ఆ ముఠా.. గడిచిన ఆరు నెలల వ్యవధిలోనే మన భారతీయులను మనపైనే ప్రయోగించి అక్షరాలా 500 కోట్ల రూపాయలను అన్యాయంగా కాజేసినట్టు వెల్లడైంది.



మోసం ఇలా..

భారత ప్రభుత్వం ఈ ముఠా నుంచి కాపాడినవారిలో స్టీఫెన్ అనే వ్యక్తి ఉన్నాడు. ఈ దందా ఎలా జరుగుతోందో అతడు వివరంగా అధికారులకు తెలిపాడు. "నేను ఐటీఐ చేశాను. కరోనా సమయంలో ఉద్యోగాన్వేషణలో ఉంటే మంగళూరు నుంచి ఒక ఏజెంట్ నన్ను సంప్రదించాడు. కంబోడియాలో డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగం ఉందని చెప్పాడు. సరేనన్నాను. నాతోపాటు.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బాబూరావు అనే వ్యక్తిని కూడా కంబోడియాకు తీసుకెళ్లాడా ఏజెంటు. ఎయిర్‌పోర్టులో ఇమిగ్రేషన్ సమయంలో.. మేం ముగ్గురం టూరిస్టు వీసా మీద వెళ్తున్నట్టు చెప్పాడు. అప్పుడే నాకు అనుమానం వచ్చింది. కానీ ఏమీ అనలేదు. కంబోడియాకు చేరుకున్నాక మమ్మల్ని ఒక ఆఫీసుకు తీసుకెళ్లాడు. అక్కడ మమ్మల్ని ఇంటర్వ్యూ చేశారు. అక్కడి బాస్ ఒక చైనీయుడు. వారు మా టైపింగ్ స్పీడ్‌ను పరీక్షించారు. కానీ.. మా ఉద్యోగం డేటా ఎంట్రీ కాదని.. నిత్యం ఫేస్‌బుక్ ప్రొఫైల్స్ చెక్ చేసి.. సైబర్ ఫ్రాడ్‌లకు లొంగిపోయే బలహీన మనస్తత్వం ఉన్నవారెవరో గుర్తించడమే మా ఉద్యోగమని ఆ తర్వాత తెలిసింది. మేం మహిళల పేరుతో, ఫొటోలతో ఫేక్ సోషల్ మీడియా ఖాతాలను తెరవాలి. డేటింగ్ యాప్స్ ద్వారా.. బలహీనులకు వలవేయాలి. వారు మా వలలో పడ్డాక క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్ పేరుతోనో, వారి పేరు మీద ఇండియాకి ఏవో వస్తువులను పంపిస్తున్నామనో ముగ్గులోకి లాగాలి. ఆ తర్వాత మరి కొందరు రంగంలోకి దిగుతారు. వలలో పడ్డవారికి దర్యాప్తు ఏజెన్సీ అధికారుల పేర్లతో ఫోన్లు చేసి డబ్బులు పిండుతారు. ఈ దందా చేసేదంతా చైనీయులే" అని స్టీఫెన్ వివరించాడు. తమకు రోజువారీ లక్ష్యాలు విధిస్తారని.. ఆ లక్ష్యాలను అందుకోలేకపోతే శిక్ష విధిస్తారని.. టార్గెట్ సాధించేదాకా తిండి పెట్టకుండా, తమ గదికి వెళ్లి విశ్రాంతి తీసుకోనివ్వకుండా హింసిస్తారని వాపోయాడు. కంబోడియాకు వెళ్లి ఉద్యోగంలో చేరగానే వారి పాస్‌పోర్టులను సైబర్ ఫ్రాడ్ ముఠా తీసేసుకోవడంతో.. వారు అక్కణ్నుంచీ బయటపడడం కష్టమవుతోందని ఒడిశా పోలీసులు వివరించారు. సైబర్ నేరగాళ్లు చెప్పిన పని చేయడానికి మనవాళ్లు నిరాకరిస్తే వారిపై దాడి చేయడం, కరెంటు షాకులివ్వడం వంటి దారుణాలకు పాల్పడుతున్నారని.. వారిని ఒంటరిగా గదుల్లో బంధిస్తున్నారని ఈ కేసును దర్యాప్తు చేసిన ఒడిశా పోలీసు అధికారి ఉపాసన తెలిపారు. అక్కడ ఇలా చిక్కుకున్న భారతీయుల వివరాలను గుర్తించి వారిని వెనక్కి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని ఆమె వివరించారు.

బాధితుడి ఫిర్యాదుతో..

కేంద్ర ప్రభుత్వ సీనియర్ ఉద్యోగి ఒకరు గత ఏడాది ఈ మాఫియా బారిన పడి రూ.67 లక్షలు పోగొట్టుకున్నారు. ఆయన ఫిర్యాదు మేరకు ఈ కేసును దర్యాప్తు చేసిన ఒడిశా పోలీసులు.. ఈ దందా అంతా కంబోడియా నుంచి జరుగుతున్నట్టు గుర్తించారు. ఉద్యోగాల పేరుతో ఇక్కణ్నుంచీ అక్కడికి మనోళ్లను తరలిస్తున్న ఎనిమిది మందిని గత ఏడాది డిసెంబరు 30న అరెస్టు చేశారు. ఆ ఎనిమిది మందీ ఒకే ప్రాంతానికి చెందినవారు కాదు. వారంతా దేశంలోని వేర్వేరు ప్రాంతాలకు చెందినవారు కావడం గమనార్హం. వారిచ్చిన సమాచారం ఆధారంగా ఒడిశా పోలీసులు మరో 16 మందిపై లుకౌట్ నోటీసులు జారీ చేశారు. ఆ లుకౌట్ నోటీసుల ఆధారంగా ఇమ్మిగ్రేషన్ బ్యూరో అధికారులు.. కంబోడియా నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న హరీశ్ కూరపాటి, నాగవెంకట సౌజన్య కూరపాటి అనే ఇద్దరిని ఎయిర్‌పోర్టులో అదుపులోకి తీసుకున్నారు.

కడప తహశీల్దార్ శివప్రసాద్ అరెస్టు
14 రోజుల రిమాండ్

తిరుపతి క్రైం, మార్చి 31: ఆదాయానికి మించి దాదాపు రూ.70 కోట్ల చర, స్థిరాస్తులు కూడబెట్టిన కేసులో కడప తహశీల్దార్ సిద్దాల శివప్రసాద్‌ను విజయవాడ సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ అధికారులు ఆదివారం అరెస్టు చేశారని ఏసీబీ ఏఎస్పీ సౌమ్యలత తెలిపారు. ఆయనకు నెల్లూరు ఏసీబీ కోర్టు 14 రోజుల పాటు రిమాండ్ విధించిందని తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తహశీల్దారుగా పనిచేసిన శివప్రసాద్ అనతికాలంలోనే కోట్లకు అధిపతిగా ఎదిగారు. తిరుపతి, రేణిగుంట, కడప ప్రాంతాల్లో కోట్లాది రూపాయల విలువ చేసే భూములు, మాల్స్, ప్లాట్స్, భవనాలు, అపార్టుమెంట్లు సమకూర్చుకున్నారు. దీనిపై ఫిర్యాదులు అందడంతో విజయవాడ అవినీతి నిరోధక శాఖలోని సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ బృందం శనివారం రంగంలోకి దిగింది. పీలేరు, తిరుపతి, రేణిగుంట, బంగారుపాళెం, కడప ప్రాంతాల్లో సోదాలు చేశారు. ఈ సోదాల్లో దాదాపు రూ.70 కోట్ల స్థిర, చరాస్తులు ఉన్నట్టు గుర్తించారు. తాజాగా.. రాష్ట్రంలోని అన్ని జాతీయ బ్యాంకులకు ఏసీబీ అధికారులు లేఖలు రాశారు. శివప్రసాద్, ఆయన భార్య మాధవి, బంధువులు, బినామీ పేర్లతో ఎక్కడైనా అకౌంట్లు ఉంటే వెంటనే లావాదేవీలు ఆపి.. ఖాతాలను సీజ్ చేయాలని ఆ లేఖలో పేర్కొన్నారు. అలాగే సోమవారం నుంచి బ్యాంకు లాకర్లు పరిశీలించడానికి ఏసీబీ అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే తహసీల్దార్‌కి సంబంధించిన బినామీల జాబితాను తెప్పించుకున్న ఏసీబీ అధికారులు తనిఖీలు చేయడానికి చర్యలు చేపట్టారు.



ప్రచార రథంపై ప్రభుత్వ సలహాదారు కర్నాటి ప్రభాకర్‌రెడ్డి, వైసీపీ నేతల బైక్ ర్యాలీలో పాల్గొన్న ఫీల్డ్ అసిస్టెంట్ (సర్కిల్‌లో)

కోడ్ ఉన్నా.. డోంట్‌కేర్!

▸▸ వైసీపీ ప్రచారంలో ప్రభుత్వ సలహాదారు
▸▸ మారని కొంతమంది ఉద్యోగుల తీరు
▸▸ రాజీనామా చేసి రావాలని వలంటీర్లపై ఒత్తిడి
▸▸ సాయిరెడ్డి ర్యాలీలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్

వరికుంటపాడు/ఉదయగిరి రూరల్/బిట్రగుంట(దగదర్తి), మార్చి 31: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు ఇప్పటికీ వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూనే ఉన్నారు. ఇలాంటివారిపై ఫిర్యాదులు అందిన వెంటనే ఎన్నికల సంఘం అధికారులు చర్యలు తీసుకుని, విధుల నుంచి సస్పెండ్ చేస్తున్నా ఉద్యోగుల్లో మాత్రం ఎలాంటి మార్పు కనిపించడం లేదు. ఆదివారం నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి వరికుంటపాడు మండలంలో 'విజయసంకల్ప యాత్ర' పేరుతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దీనిలో పలువురు ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే ఏపీ రైతు సాధికారిత సంస్థ ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు కర్నాటి ప్రభాకర్‌రెడ్డి ఏకంగా ప్రభుత్వం కేటాయించిన వాహనం ఎక్కి దారి పొడవునా ర్యాలీలో పాల్గొన్నారు. అలాగే, వింజమూరు మండలం నందిగుంట ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు జక్కం మోహన్‌రెడ్డి సైతం ప్రచారంలో పాల్గొన్నారు. ఇటీవల నిబంధనలు ఉల్లంఘించిన తూర్పుకొండారెడ్డిపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ చెంచురెడ్డిని విధుల నుంచి తొలగించినా ఆయన ఏమాత్రం భయం లేకుండా మళ్లీ ప్రచారంలో పాల్గొన్నారు.

వలంటీర్లపై ఒత్తిడి

రాజీనామా చేసి వైసీపీ ప్రచారంలో పాల్గొనాలని అధికార పార్టీ నేతలు గ్రామ/వార్డు వలంటీర్లపై ఒత్తిడి తెస్తున్నారు. వైసీపీ మరోసారి అధికారంలోకి రాగానే మీరే వలంటీర్లుగా ఉంటారని వారికి భరోసా ఇస్తున్నారు. అయినప్పటికీ కొందరు వలంటీర్లు జంకుతున్నారు. కాగా, నెల్లూరు జిల్లా దగదర్తి మండలంలో ఆదివారం వైసీపీ నేతల ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, విజయసాయిరెడ్డి పాల్గొన్నారు. వారి వెనుకే వెలుపోడు పంచాయతీ కామినేనిపాలెం ప్రాంతానికి చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ కామినేని నాగరాజు కూడా పాల్గొన్నారు. ఈ విషయాన్ని కొందరు స్థానికులు మండల, డివిజన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

భర్త మర్మాంగంపై మరిగే నీళ్లు..!

▸▸ కుటుంబ కలహాలతో హత్యాయత్నం చేసిన భార్య

వినుకొండటౌన్, మార్చి 31: నిద్రిస్తున్న భర్త మర్మాంగంపై సలసల మరిగే నీటిని పోసి భార్య హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పల్నాడు జిల్లా వినుకొండలో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. బాధితుడి కథనం మేరకు ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం గ్రామానికి చెందిన నాయిని ప్రభుదాస్, అతని భార్య అనూష గత కొన్ని రోజులుగా వినుకొండ పట్టణంలోని హనుమాన్ నగర్ 13వ లైన్‌లో నివాసం ఉంటున్నారు. కుటుంబ కలహాలతో కొంతకాలంగా వేర్వేరుగా జీవనం సాగిస్తున్నారు. పెద్ద మనుషులు సర్దిచెప్పి కాపురానికి పంపించారు. వారంరోజుల క్రితం కాపురానికి వచ్చిన భార్య ఆమె తల్లిదండ్రులతో కలిసి సలసల మరిగే నీరు పోసి హత్యాయత్నానికి పాల్పడినట్టు ప్రభుదాస్ తెలిపాడు. తీవ్రంగా గాయపడిన బాధితుడిని ప్రైవేట్ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.